విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

బుధవారం 24 జూలై 2024 — 8 పేజీలు

వెనుక పడిన జిల్లాల జాబితాలో ప్రకాశం

విశాలాంధ్ర-ఒంగోలు :



కేంద్ర బడ్జెట్‌పై వామపక్ష పార్టీలు, కాంగ్రెస్ పెదవి విరుస్తుంటే, టిడిపి, జనసేన, బిజెపి పార్టీలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. దేశంలోనే వెనుకబడిన ప్రకాశం జిల్లాను ఎట్టకేలకు వెనుకబడిన జిల్లాల జాబితాలో చేర్చారు. అయితే నిధులు కేటాయింపు పైనే అసలు సమస్య ప్రారంభమవుతుంది. రాష్ట్రంలో వెనుకబడిన జిల్లాలకు నిధులు కేటాయిస్తామని పేర్కొన్నారే తప్ప ఎంత కేటాయిస్తారు, ఏ ఏ రంగాలకు వినియోగించుకోవాలి, ఎప్పటిలోగా నిధులు ఖర్చు చేయాలి అని అంశాలపై స్పష్టత లేదు. బడ్జెట్ కంటేనే అంకెలతో కూడుకున్న వ్యవహారం. అటువంటి అంకెలు లేకుండా కేవలం హామీలతో నిర్మల సీతారామన్ గతంలో ఎన్నడూ లేని విధంగా బడ్జెట్ను ప్రవేశపెట్టారు.

నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీని మరిచారు
- సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ

రాబోయే ఐదేళ్లలో 4 కోట్ల మందికి ఉపాధి కల్పిస్తామని చెప్పారు. అంటే ఏడాదికి 80 లక్షల మందికి మాత్రమే ఇస్తామన్నట్లుగా అర్థమవుతుంది. 2014 ఎన్నికల సందర్భంలో కేంద్రంలో బిజెపి అధికారంలోకి వస్తే ఏటా 2 కోట్ల ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని బిజెపి హామీ ఇచ్చింది. కానీ దేశంలో ఎక్కడా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించకపోవడం వల్ల రికార్డు స్థాయిలో నిరుద్యోగం

పెరిగింది. నిరుద్యోగ నిర్మూలనకు కేంద్రం ప్రత్యేక దృష్టి పెట్టాలి. పెట్రోల్ ఉత్పత్తులు, నిత్యవసర వస్తువులు, తదితరాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. అధిక ధరలు తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలి. అమరావతి రాజధాని నిర్మాణానికి రూ.15 వేల కోట్లు కేటాయించడాన్ని స్వాగతిస్తున్నాం. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం అమరావతిని రాజధానిగా గుర్తించడం వల్ల కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులు ఉపయోగపడతాయని భావిస్తున్నాం. పోలవరం జాతీయ ప్రాజెక్టు నిర్మాణం విషయంలో నిర్వాసితుల సమస్యలు పరిష్కరించకుండా, పునరావాస ప్యాకేజీ ఇవ్వకుండా ప్రాజెక్టు పూర్తి చేస్తామనడం వల్ల ప్రయోజనం లేదు.

- నిధుల కేటాయింపుపై స్పష్టత కరువు
- వ్యవసాయ రంగంపై చిన్నచూపు
- జిల్లాకు పరిశ్రమల రాకపై అనుమానాలు
- నిరుద్యోగం మరింత పెరిగేలా కేంద్ర బడ్జెట్
- కేంద్ర బడ్జెట్‌పై హర్షం వ్యక్తం చేస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు
- ప్రత్యేక హోదా ఎక్కడంటున్న వామపక్ష శ్రేణులు

(బడ్జెట్‌పై అభిప్రాయాలు 2లో)

శుద్ధమైన తాగునీరు అందించాలి

కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

విశాలాంధ్ర-దర్శి : ప్రజలకు తాగునీటికి ఇబ్బంది లేకుండా స్వచ్ఛమైన తాగునీరు అందించేలా ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, ఆర్.డబ్ల్యూ.ఎస్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఇరిగేషన్, ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి దర్శిలో గల ఒంగోలు బ్రాంచ్ కెనాల్ హెడ్ రెగ్యులేటర్‌ను, దర్శి బ్రాంచ్ కెనాల్ నుండి దర్శి చెరువుకు నీరు సరఫరా చేసే పంపు హౌస్‌ను పరిశీలించి, వాటర్ లభ్యత వివరాలను అడిగి తెలుసుకున్నారు. తదుపరి దర్శి చెరువును, తాగునీటి సరఫరాకు సంబం ధించిన ఫిల్టర్ బెడ్ యూనిట్‌ను, రాపిడ్ శాండ్ ఫిల్టర్ యూనిట్‌ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, దర్శి ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆర్.డబ్ల్యూ.ఎస్ అధికారులను ఆదేశించారు. అనంతరం దర్శి పట్టణంలో మున్సిపల్ కార్యాలయం నూతన భవన నిర్మాణానికి నిర్దేశించిన స్థలాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అనంతరం కురిచేడు మండల పరిధిలో ఉన్న దర్శి బ్రాంచి కెనాల్ హెడ్ రెగ్యులేటర్‌ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట ఇరిగేషన్ ఎస్.ఈ మురళీకృష్ణ, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్ధన్ ఆలి, ఆర్డిఓ జాన్ ఇర్విన్, దర్శి నియోజకవర్గం ఇన్చార్జి డా.గొట్టిపాటి లక్ష్మి, దర్శి తహసీల్దార్ శ్రీమతి సుజాత, కురిచేడు తహసీల్దార్ సుధాకర్ పాల్గొన్నారు.

మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ఉద్యోగం, రూ.2 లక్షలు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలి

ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కోటి దాసు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : పురపాలక సంఘంలో పని చేస్తూ చనిపోయిన కార్మికులకు కుటుంబాలకు ఉద్యోగం, రూ.2 లక్షలు ఎక్స్ గ్రేషియా, మట్టి ఖర్చులు, అందజేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కోటి దాసు, ఏఐటియుసి జిల్లా నాయకులు తన్నీరు సింగరకొండతో కలసి డిఆర్ఓ బాపట్ల మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ సత్తిబాబుకు వినతి పత్రం అందజేశారు. సెంట్రల్ గవర్నమెంట్ జీవో ప్రకారం రూ.2 లక్షలు ఎక్స్ గ్రేషియా మట్టి ఖర్చులు ఇప్పించాలని మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి. సుబ్బారావు, డి.మాల్యాద్రిలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా తన్నీరు సింగర కొండ మాట్లాడుతూ చుక్కాకుల నాగరాజు భార్య ఈశ్వరమ్మకు, గంధళ్ల చిన్న అంజమ్మ కుమారుడు గంధళ్ల తిరుపతి వెంకయ్యకు, పిన్ని బోయిన నాగరాజు భార్య పిండిబోయిన మల్లేశ్వరికి మిగతా 2 లో ...

'నాడు - నేడు' పనులపై విచారణ చేపట్టాలి

విశాలాంధ్ర - మార్టూరు : గత వైసిపి ప్రభుత్వంలో చేపట్టిన నాడు నేడు పనులపై సమగ్ర విచారణ చేపట్టాలని, యువ నేత మంత్రి నారా లోకేష్ విద్యా శాఖను ప్రక్షాళన దిశగా చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. మంగళవారం అసెంబ్లీలో ఎమ్మెల్యే ఏలూరి ప్రసంగించారు. గత వైసిపి ప్రభుత్వం హయాంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నాడు నేడు పథకాన్ని ప్రచారార్బటానికి వాడుకున్నారని ధ్వజమెత్తారు. పేదల కోసం ఈ ప్రాజెక్టును రూపొందించామని గొప్పలు చెప్పారని మండిపడ్డారు. వాస్తవానికి ఈ పథకానికి 2014 -2019 మధ్య ఆనాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ పథకానికి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. పేద విద్యార్థులు అన్ని వసతులతో కూడిన పాఠశాలలో చదువుకోవాలని ముఖ్యంగా పేద బడుగు బలహీన ముస్లిం మైనారిటీల పిల్లలు చదువుకునే పాఠశాలల్లో అన్ని వసతులు ఉండాలని (హైబ్రిడ్ యాన్యుటీ మోడల్) పథకాన్ని ప్రారంభించారని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా 4800 కోట్ల రూపాయలతో వెచ్చించి అన్ని పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకున్నారన్నారు. ఇందుకోసం పాఠశాలల్లో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు,విద్యార్థులు తల్లిదండ్రులు ప్రజాప్రతినిధులు అధికారులను భాగస్వామ్యం చేసి

పనులు చేసేలా చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. అన్ని జిల్లాల్లో పనులు జరుగుతున్న సమయంలో 2019లో ప్రభుత్వం మారింది. తర్వాత ఏ సభలో జగన్మోహన్ రెడ్డి చాలా ప్రగల్భాలు పలికారు,మూడేళ్లలో రాష్ట్రంలో ఉన్న పాఠశాలలన్నీ పరిస్థితులను మారుస్తామని చెప్పి.. ఈ పథకాన్ని నాడు నేడు అని పేరు పెట్టి ఆదాయ వనరుగా మార్చుకున్నారని మండిపడ్డారు. పేద విద్యార్థులకు అందవలసిన వస్తువుల్లో కూడా కక్కుర్తి పడి సెంట్రల్ ప్రొక్యూర్ మెంట్ సిస్టం ద్వారా అవినీతికి పాల్పడ్డారని పేర్కొన్నారు. ఈ రకంగా డబ్బులు సంపాదిస్తూ అక్కడ పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులను పనులకు బాధ్యులు చేస్తూ వారితో ఇలాంటి పనులన్నీ చేయించి వారిని మానసికంగా వేధించారన్నారు. తల్లిదండ్రులను ఎక్కడ ఇన్వాల్వ్ చేయకుండా వైఎస్ఆర్సిపి నేతలను కాంట్రాక్టర్ అవతార మెత్తెలా తయారు చేశారన్నారు. విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసి మెరుగైన వసతులను కల్పించి మెరుగైన విద్యను అందించేలా మహా యజ్ఞానికి ఆనాడు చంద్రబాబు మొదలుపెట్టారని, ఈనాడు లోకేష్ బాబు పూర్తి చేయాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు.

- ప్రచార్భాటానికే మాజీ సీఎం జగన్ 'నాడు-నేడు'
- వైసీపీ నేతలే కాంట్రాక్టర్ల అవతారం
- ఐదేళ్లూ రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం
- అక్రమాలు అన్యాయాలను నిలదీస్తూ గళమెత్తారని పయ్యావులకు కితాబు
- ఆర్థిక నష్టంపై ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలి
- అసెంబ్లీలో గళమెత్తిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

రోడ్డు మరమ్మతులకు కలెక్టర్ ప్రతిపాదనలు

విశాలాంధ్ర-చీమకుర్తి : ఒంగోలు - కర్నూలు రహదారిలోని చీమకుర్తి మండలం, మర్రిచెట్ల పాలెం, బూదవాడ గ్రామాల వద్ద దెబ్బతిన్న రోడ్డును మంగళవారం ఉదయం ప్రకాశం జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, రహదారులు మరియు భవనాల శాఖ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు మరమ్మతు పనుల ఎస్టిమేషన్స్ తదితర వివరాలను ఆర్ అండ్ బి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఒక కోటి 70 లక్షలతో రోడ్డు మరమ్మతు పనులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందని, లో లెవెల్ లో రోడ్డు వున్నందున సుమారు రెండు అడుగుల మేర లెవలింగ్ చేసి రోడ్డు మరమ్మతులు చేపట్టాల్సి వుందని ఎస్.ఈ. దేవానందం, జిల్లా కలెక్టర్‌కు వివరించారు. జిల్లా ప్రధాన రహదారుల్లో ఒకటైన ఈ రోడ్డు మరమ్మతు పనులు త్వరితగతిన చేపట్టేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్ అండ్ బి.ఎస్.ఈ. దేవానందం, ఈ.ఈ గోపి నాయక, డి.ఈ అరుణ కుమారి పాల్గొన్నారు.

నాయుడుపాలెంలో ఆర్జేడి ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-టంగుటూరు : గుంటూరు ప్రాంతీయ సంచాలకులు ఈ లింగేశ్వర రెడ్డి తూర్పునాయుడుపాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పరిసరాలను తరగతి గదులను పరిశీలించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. టంగుటూరు పేరుకు ఉన్న ప్రత్యేకత ఏమిటి అని విద్యార్థులను ప్రశ్నించారు బదులుగా విద్యార్థులు టంగుటూరి ప్రకాశం పంతులుగారు అని జవాబు చెప్పారు. పలు సబ్జెక్టుల్లో విద్యార్థులను పరీక్షించి ఉపాధ్యాయులకు తగు సూచనలు తెలియజేశారు. విద్యార్థులకు ప్రతివారం పరీక్షలు నిర్వహించి విద్యార్థులలో సామర్థ్యాలను పెంచాలని హెచ్ఎం సుధారాణికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ఎంఈఓ కిషోర్ బాబు టంగుటూరు ఎంఈఓలు చెంచు పున్నయ్య తన్నీరు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ఉద్యోగం, రూ.2 లక్షలు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలి

(మొదటిపేజీ తరువాయి)

ఉద్యోగం కొరకు డిఆర్ఓను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. పైన తెలిపిన ముగ్గురు మునిసిపల్ ఉద్యోగం చేస్తూ మరణించారని వారి కుటుంబ సభ్యులకు గవర్నమెంట్ జీవో ప్రకారం ఉద్యోగము, ప్రభుత్వం తరపున రావలసిన రెండు లక్షల రూపాయల ఎక్స్ గ్రేషియా మట్టి ఖర్చులు ఇప్పించాలని కోరారు. పురపాలక సంఘంలో పని చేస్తున్న పారిశుద్ధ కార్మికులకు సంబంధించిన పిఎఫ్, ఈఎస్ఐ వివరాలు సరిగా లేవని పేర్కొన్నారు. గత సంవత్సరం అన్ని మున్సిపాలిటీలలో పారిశుద్ధ కార్మికులకు సంబంధించిన పిఎఫ్ ఈఎస్ఐ వివరాలు పొందు పరిచారన్నారు. కాని బాపట్లలో పనిచేస్తున్న మున్సిపల్ పారిశుద్ధ కార్మికుల సంబంధించిన వివరాలు నేటికీ పూర్తి చేయలేదన్నారు. పారిశుద్ధ కార్మికులకు సంబంధించిన పిఎఫ్ ఈఎస్ఐ వివరాలు సాధ్యమైనంత త్వరలో పొందుపరిచి వారికి తగిన న్యాయం చేయవలసిందిగా డిఆర్ఓను కోరారు.

వెనుక పడిన జిల్లాల జాబితాలో ప్రకాశం

కేంద్ర బడ్జెట్‌పై వామపక్ష పార్టీలు, కాంగ్రెస్ పెదవి విరుస్తుంటే, టిడిపి, జనసేన, బిజెపి పార్టీలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. దేశంలోనే వెనుకబడిన ప్రకాశం జిల్లాను ఎట్టకేలకు వెనుకబడిన జిల్లాల జాబితాలో చేర్చారు. అయితే నిధులు కేటాయింపుపైనే అసలు సమస్య ప్రారంభమవుతుంది. రాష్ట్రంలో వెనుకబడిన జిల్లాలకు నిధులు కేటాయిస్తామని పేర్కొన్నారే తప్ప ఎంత కేటాయిస్తారు, ఏ ఏ రంగాలకు వినియోగించుకోవాలి, ఎప్పటిలోగా నిధులు ఖర్చు చేయాలి అని అంశాలపై స్పష్టత లేదు. బడ్జెట్ కంటేనే అంకెలతో కూడుకున్న వ్యవహారం. అటువంటి అంకెలు లేకుండా కేవలం హామీలతో నిర్మల సీతారామన్ గతంలో ఎన్నడూ లేని విధంగా బడ్జెట్ను ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్‌పై పలువురు తమ అభిప్రాయాలు తెలిపారు.

-విశాలాంధ్ర, ఒంగోలు :

అభివృద్ధి - సంక్షేమాలకు పెద్ద పీట

- ఒంగోలు ఎంపీ మాగుంట

వికసిత్ భారత్ 2047 విజన్ను అనుగుణంగా నేడు లోక్ సభలో కేంద్ర ఆర్థిక మంత్రి, నిర్మలా సీతారామన్ రూ.48.21 లక్షల కోట్లతో 7 సారి ప్రవేశపెట్టిన 2024-25 పూర్తి స్థాయి బడ్జెటులో అభివృద్ధి, మౌలికవసతుల మరియు సంక్షేమాలకు పెద్ద పీటవేశారు. బడ్జెటులోని ముఖ్యాంశాలు: మౌలిక సదుపాయాల కల్పనకు రూ.11.11 లక్షల కోట్లు, విద్య - నైపుణ్యాభివృద్ధికి రూ.1.48 లక్షల కోట్లు, గ్రామీణాభివృద్ధి శాఖకు రూ.2.66 లక్షల కోట్లు, మహిళాలాభివృద్ధికి రూ. 3.00 లక్షల కోట్లు, వ్యవసాయం - అనుబంధ రంగాలకు రూ. 1.52 లక్షల కోట్లు, రైల్వేలకు రూ.2.50 లక్షల కోట్లు, పట్టణ గృహాలకు రూ.2.2 లక్షల కోట్లు, మధ్య తరగతి నివాసాలకు అభివృద్ధికి 10 లక్షల కోట్లు, రక్షణ శాఖకు రూ. 4.54 లక్షల కోట్లు, హోమ్ శాఖకు రూ.1.50 లక్షల కోట్లు, వైద్యానికి రూ. 89 వేల కోట్లు, విద్యుత్ కు రూ. 68 వేల కోట్లు, సాంఘిక సంక్షేమానికి రూ. 56 వేల కోట్లు, వాణిజ్యం -పరిశ్రమలకు రూ. 47 వేల కోట్లతో పాటు తదితర అన్ని శాఖలకు కూడా సముచితంగా కేటాయింపులు చేశారు. యువత కోసం ఐదు పథకాలు, 500 పెద్ద కంపెనీలలో కోటి మందికి ఉద్యోగాలు, ముద్ర రుణాలు 10 కోట్లు నుండి 20 లక్షల కోట్లకు పెంపు, 100 నగరాలలో పారిశ్రామిక పార్కుల ఏర్పాటు, 12 పారిశ్రామిక కేంద్రాలు ఏర్పాటు, అన్ని పంటల వుత్పత్తి మరియు మద్దతు ధరల పెంపు, పప్పు ధాన్యాలు - నూనె గింజలు - కూరగాయలు వుత్పత్తి పెంపు, ఖనిజాలు -మొబైల్స్ - రొయ్యలు - చేపలు - సోలార్ ఉత్పత్తులు - లెదర్ ఉత్పత్తులపై పన్ను మరియు కస్టమ్ డ్యూటీలు తగ్గింపు బడ్జెటులోని తదితర ముఖ్యాంశాలకు కూడా నిధులు సముచితంగా కేటాయించారు.

ప్రజల ఆశలను, ఆకాంక్షలను గాలికి వదిలేసిన బడ్జెట్

- సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు

పార్లమెంటులో ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ బడ్జెట్ మెజారిటీ ప్రజల ఆశలను, ఆకాంక్షలను పట్టించుకోకుండా గాలికి వదిలేసింది. వ్యవసాయాన్ని, ఉపాధి హామీ పథకాన్ని నిర్లక్ష్యం చేసింది. ఇది అన్ని వర్గాల ప్రజలకు సంతృప్తినిచ్చే బడ్జెట్ గా ఎన్డీఏ ప్రభుత్వం చెప్పుకోవడం సిగ్గుచేటైన విషయం. బడ్జెట్ కార్యాలయంలో 19 శాతం వడ్డీలు చెల్లించడానికే సరిపోతుంది. అలాగే బడ్జెట్ కేటాయింపుల్లో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు తీరని అన్యాయం జరిగింది. యువజన హామీ చట్టాన్ని అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎన్నో ఆందోళనలు, పోరాటం చేసిన విభజన హామీల ప్రస్తావన బడ్జెట్లో కనీసంగా కూడా లేవు. కాకపోతే బీహార్ జనతా దల్ యు, టిడిపి లపై కేంద్ర ప్రభుత్వం ఆధారపడి ఉన్నందున కొన్ని వరాలు మాత్రమే ప్రకటించినది. బీహార్ నాయకులు నితీష్ ప్రత్యేక హోదా కావాలని నోరు ఎత్తినందు ఉన్న వారికి కొన్ని ప్రత్యేక కేటాయింపులు జరిగాయి. ప్రత్యేక హోదాను సాధించడంలో ఆంధ్రాలో తెలుగుదేశం, వైసిపి పార్టీలు పూర్తిగా విఫలమయ్యాయి.

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి ప్రాధాన్యం

- టీడీపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ నూకసాని బాలాజీ హర్షం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు, అన్ని రంగాల అభివృద్ధికి సీఎం నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని ప్రకాశం జిల్లా తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు మరియు జిల్లా ప్రజా పరిషత్ మాజీ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ పత్రికా ప్రకటన ద్వారా పేర్కొన్నారు.ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాధాన్యం ఇవ్వడంపై నూకసాని బాలాజీ హర్షం వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి భారీగా నిధులు రాబట్టిన టిడిపి-జనసేన-బిజెపి కూటమి ప్రభుత్వానికి అభినందనలు తెలియజేశారు. సీఎం చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనల ఫలితంగా రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యం దక్కిందని నూకసాని బాలాజీ అన్నారు.కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్ల ఆర్థిక సాయం ప్రకటించడం గొప్ప విషయమని, అలాగే భవిష్యత్తులోనూ రాజధాని నిర్మాణానికి సహాయం అందు తుందని కేంద్ర ఆర్థిక మంత్రి ప్రకటించడంపై ధన్యవాదాలు తెలిపారు.రాష్ట్ర జీవనాడి పోలవరం పూర్తికి అధిక నిధులు కేటాయింపుపై సంతోషం వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో వెనుకబడిన రాయలసీమ ప్రాంతం, ప్రకాశం జిల్లా, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వడం ద్వారా ఆయా ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్నారు. పూర్వోదయ పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్ కి ప్రత్యేక ప్రాజెక్ట్, ఏపీ విభజన చట్టం అమలుకు పూర్తి స్థాయిలో కట్టుబడి ఉన్నామని బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించడంపై నూకసాని బాలాజీ ధన్యవాదాలు తెలియజేశారు. సమర్థవంతమైన నాయకత్వం ఎలా ఉంటుందో సీఎం నారా చంద్రబాబు నాయుడు చేసి చూపారన్నారని కొనియాడారు.

ఆంధ్రప్రదేశ్‌కు ప్రవేశపెట్టిన బడ్జెట్ హర్షణీయం

- ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణం కోసం 15 వేల కోట్ల నిధులను కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టడం హర్షణీయమని హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ తెలంగాణ నుండి విడిపోయిన తరువాత రాజధాని లేని ఆంధ్రప్రదేశ్ కు రాజధాని నిర్మాణం కోసం ఒకేసారి భారీ బడ్జెట్ను విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వానికి ఆంధ్ర ప్రజలు రుణపడి ఉంటారని అన్నారు. కేంద్రం సముచిత ఆలోచనతో అన్ని రంగాలకు బడ్జెట్ను అందించిందని అన్నారు. దేశవ్యాప్తంగా రైతాంగానికి, యువతకు, చిరు వ్యాపారులకు, వివిధ రంగాలలో పనిచేయు ప్రతి ఒక్కరికి కేంద్ర ప్రభుత్వం పెద్ద పీట వేసిందని తెలిపారు. విభజన హామీలు రాజధాని అవసరాన్ని గుర్తించి ప్రత్యేక ఆర్థిక సాయం అందించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని అన్నారు.ప్రకాశం జిల్లాను వెనకబడిన జిల్లాల జాబితాలో ప్రకాశంను చేర్చుతానని గతంలో చంద్రబాబు హామీ ఇచ్చారు- ఢిల్లీ పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు గారు ఈ అంశాన్ని ప్రధాని దృష్టికి తెచ్చారు - బడ్జెట్‌లో ప్రకాశం జిల్లాకు ప్రాధాన్యం దక్కడం శుభసూచికం - జిల్లా అభివృద్ధికి కేంద్ర తోడ్పాటు ఎంతో ఉపకరిస్తుంది - ప్రధాని, కేంద్రానికి ప్రకాశం జిల్లా ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేసారు.

విద్యుత్ ఘాతానికి ముగ్గురు విద్యార్థులు బలి

విశాలాంధ్ర-కనిగిరి : విద్యుత్ ఘాతానికి గురై ముగ్గురు విద్యార్థులు అక్కడికక్కడే కాలి దహనమైన సంఘటన కనిగిరి మండలం పునుగోడు సమీపంలోని ఎస్టి కాలనీ వద్ద జరిగింది. కనిగిరికి చెందిన ముగ్గురు పిల్లలు..అందులో ఇద్దరు విద్యార్థులు ఒకరు వారి స్నేహితుడిగా తెలిసింది. దేసి పోగు నజీర్(16), గౌతమ్ కుమార్(17)లు పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీ చదువుతుండగా, మరొకరు కామినేని బాలాజీ (17) ఇందిరా కాలనీకి చెందిన పిల్లవాడు. ముగ్గురు స్నేహితులు కలిసి మధ్యాహ్నం తర్వాత పునుగోడు చెరువు వద్ద ఈతకొట్టేందుకు వెళ్తూ మార్గమధ్యంలో పొలానికి వెళ్లే విద్యుత్ కండక్టర్ 11 కెవి ప్రధాన విద్యుత్ కండక్టర్ వైరు తెగి పడి ఉంది. దానిని తగలడంతో మంటలు రేగి నడుము వరకు కాలి అక్కడికక్కడే చనిపోయారు. ఘటన స్థలాన్ని డిఎస్పి రత్నాకర్ రామరాజు. పోలీస్ అధికారులు, రెవెన్యూ అధికారులు పరిశీలించారు

తాడిపత్రి, చీరాల ఎమ్మెల్యేలను మర్యాదపూర్వకముగా కలిసిన టీడీపీ నాయకులు

విశాలాంధ్ర-పామూరు : అమరావతిలో జరుగుతున్న శాసనసభ సమావేశాలకు హాజరైన తాడిపత్రి, చీరాల శాసన సభ్యులు జెసి అస్మిత్ రెడ్డి, ఎం ఎం కొండయ్య యాదవ్ లను పామూరు మండల టిడిపి నాయకులు మంగళవారం మర్యాదపూర్వకముగా కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. కలసిన వారిలో ఎంపీటీసీ బొల్లా నరసింహారావు, యారవ శ్రీనివాసులు, ఇర్రి కోటిరెడ్డి, గోళ్ళ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

రైతులకు శిక్షణ

విశాలాంధ్ర-కొమరోలు : ఈ ఆర్థిక సంవత్సరములో పండ్ల తోటల పెంపకం చేపట్టే రైతులకు మంగళవారం శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో నరసింహారావు అధ్యక్షత వహించారు. రైతులకు పండ్ల తోటల పెంపకంకు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అలాగే ఎన్ఆర్ఇజీఎస్ నందు పండ్ల తోటలు సాగు చేసుకుని రైతులకు ఉండవలసిన అర్హతలు పంటల వారీగా వచ్చే రాయితీల గురించి సాగు చేసుకునే విధంగా విధివిధానాల గురించి ఏపీఓ మహాలక్ష్మి తెలియడం జరిగింది ఏపీఎంఐపి డిపార్ట్మెంట్ నుండి ఎంఐ ఏవో డిప్పు వలన కలిగే లాభాల గురించి సబ్సిడీలను గురించి రైతులకు వివరించడం జరిగింది. ఎంపీడీవో నరసింహారావు ఎన్ఆర్ఇజిఎస్ ఏపీవో ఆర్ మహాలక్ష్మి, ఈసీ కోటిరెడ్డి, ఎంఐ ఏవో మౌన కృష్ణ టిఏలు పాల్గొన్నారు.

అగ్రహారం వ్యవసాయ పొలాల్లో కేబుల్ వైర్లతో ఇబ్బందులు

మరమ్మతులు చేస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

విశాలాంధ్ర-మద్దిపాడు : మద్దిపాడు మండలంలోని కెల్లంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని జీ అగ్రహారం ఒంగోలు వయా పొదిలి హైవే ఆర్ అండ్ బి రహదారి పక్కన 11 కెవి విద్యుత్ లైన్ లకు కేబుల్ వైర్లు లాగడంతో వర్షాల కారణంగా కేబుల్ వైర్లు కిందకి జారి వేలాడుతూ ఉండడంతో రైతులు వ్యవసాయం కోసం పొలాల్లోకి ట్రాక్టర్లతో వెళ్లాలంటే ఇబ్బందికరంగా మారింది. దీంతో అగ్రహారం రైతులు తమ పడుతున్న ఇబ్బందులు విద్యుత్ శాఖ ఏఇ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మద్దిపాడు విద్యుత్ శాఖ ఏఈ రామకృష్ణారెడ్డి మంగళవారం తన సిబ్బందితో పనులు మొదలుపెట్టారు. ఒంగోలు వైపు నుండి పొదిలి వైపుకు వెళ్లే విద్యుత్ స్తంభాలకు ప్రైవేట్ కేబుల్ వైర్లు రైతులకు ఇబ్బందికరంగా లేకుండా విద్యుత్ స్తంభాల పైకి వైర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇకనుండి రైతులకు కేబుల్ వైర్ల సమస్య పోతుందని మద్దిపాడు విద్యుత్ శాఖ ఏఇ రామకృష్ణారెడ్డి తెలిపారు.

విద్యార్థులకు అక్షరాభ్యాసం

విశాలాంధ్ర-వెలిగండ్ల : మండల కేంద్రమైన వెలిగండ్ల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి సిహెచ్. రామచంద్రరావు, మండల విద్యాశాఖ అధికారి దాస్ ప్రసాద్ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో మంగళవారం అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ క్రమంలో సరస్వతి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి చిన్నారులతో పలకలపై అక్షరాలు దిద్దించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అనుభవం గల ఉపాధ్యాయులచే మెరుగైన విద్యను అందజేయడం జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థిని విద్యార్థుల కోసం ప్రతి పథకాన్ని అవకాశాన్ని విద్యార్థి విద్యార్థిని ఉపయోగించుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాఠశాల సిబ్బంది ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే ఆటో డ్రైవర్లపై చర్యలు

డీఎస్పీ బాలసుందరరావు

విశాలాంధ్ర-మార్కాపురం : మార్కాపురం పట్టణంలో నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపే ఆటో డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని డియస్పి బాలసుందరరావు హెచ్చరించారు. మార్కాపురం పట్టణ పోలీసు స్టేషన్ ఆవరణలో ఆటోడ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ కొందరు ఆటోడ్రైవర్లు ప్రయాణీకుల అవసరాలను ఆసరా చేసుకుని ఎక్కువ మొత్తంలో వసూలుచేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, ప్రధానంగా రైల్వేస్టేషన్ నుంచి రాత్రిపూట పట్టణంలోనికి ప్రయాణీకులను తీసుకునివచ్చే ఆటో డ్రైవర్లు ఎక్కువ మొత్తంలో చార్జీలు వసూలు చేస్తున్నట్లుగా ఎక్కువ సంఖ్యలో ఫిర్యాదులు వచ్చాయని, ఇప్పటినుంచి వారిపై ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు. నిబంధనల ప్రకారమే చార్జీలు వసూలుచేయాలని తెలిపారు. ప్రతి ఆటో డ్రైవరు పరిమితికి మించి ప్రయాణీకులను ఎక్కించుకున్నా, డ్రైవింగ్ లైసెన్స్, సీబుక్, పర్మిట్, పొల్యూషన్ సర్టిఫికేట్లు లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రమాదాల నివారణకు సహకరించాలని అన్నారు. ఎక్కడ పడితే అక్కడ ప్రయాణీకులు చేయెత్తారని ఆటో ఆపితే వెనుకవచ్చే వాహనాలను ఢీకొనే ప్రమాదం ఉందని, ట్రాఫిక్ నింబందనలు దృష్టిలో పెట్టుకుని రోడ్లపై ఆటోలు ఆపాలని అన్నారు. మార్కాపురం పట్టణంలో రోడ్ల వెడల్పు తక్కువగా ఉన్నందున ఆటోలను రోడ్లపై లైనుగా పెట్టి ట్రాఫిక్కు అంతరాయం కలిగించవద్దని సీఐ ఆవుల వెంకటేశ్వర్లు సూచించారు. ఇష్టంవచ్చినట్లుగా పట్టణంలో ఓవర్స్పీడుతో వెళ్లవద్దని చెప్పారు. పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్ ఆటో డ్రైవర్లకు పలు సూచనలు చేశారు.

సాగు పత్రాలపై రైతులకు అవగాహన

విశాలాంధ్ర-వెలిగండ్ల : కౌలు రైతులు భూ యజమానుల నుండి హక్కు పత్రాలను పొంది కౌలు కార్డులను పొందాలని కనిగిరి నియోజకవర్గం వ్యవసాయ అధికారి ఏడిఇ వెంకటరమణ సూచించారు. మంగళవారం మండలంలోని గుడిపాటి పల్లి రైతు భరోసా కేంద్రం నందు రెవిన్యూ, వ్యవసాయ శాఖ సంయుక్తంగా కౌలు కార్డుల పై అవగాహన నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ రైతులు భూయజమానుల నుండి కౌలు పత్రం తీసుకొని దాని ద్వారా కౌలు కార్డులను పొందాలని సూచించారు ఈ క్రమంలో వ్యవసాయ అధికారి రంగా కృష్ణ మాట్లాడుతూ కౌలుదారులు పంట మీద మాత్రమే హక్కులు ఉంటాయని భూమి మీద ఎటువంటి హక్కు ఉండదని తెలిపారు రైతులకు అన్ని రకాల నష్టపరిహారాలు వర్తిస్తాయని కావలసినవారు గ్రామ రెవెన్యూ అధికారిని సంప్రదించి కౌలు కార్డులను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో దయాకర్, వి ఏ ఏ జిలాని, ఆంజనేయులు గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీల బకాయిలను వెంటనే చెల్లించాలి

వ్యవసాయ కార్మిక సంఘం ప్రకాశం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు డిమాండ్

విశాలాంధ్ర-పీసీపల్లి : మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ కూలీలకు నిలిచిన బకాయిలను వెంటనే చెల్లించి కనీస వేతనమును కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీవో వెంకట సుబ్బారావుకు అందజేశారు. ఈ సందర్భంగా బడుగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకాన్ని కావాలనే నిర్వీర్యం చేస్తున్నారని పొమ్మనలేక పొగబెట్టే చందంగా ఉపాధి హామీ పథకం నిధుల కోత విధించి ఉపాధి కూలీలకు ఉపాధి పథకాన్ని దూరం చేస్తున్నారని గత 12 వారాలగా నిలిచిన ఉపాధి బిల్లులను వెంటనే చెల్లించాలని కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీని తగ్గించేందుకు బడ్జెట్లో కోత విధిస్తుందని గత బడ్జెట్లో ఉపాధి హామీకి 60వేల కోట్ల మాత్రమే కేటాయించడం జరిగిందని ప్రవేశపెట్టబోయే బడ్జెట్లో రూ 2 లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు కనీస వేతనం కల్పించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఉపాధి కార్మికులకు సంవత్సరానికి 200 రోజులు పనిదినాలు కల్పించి రోజుకు రూ 600 లు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల ప్రధాన కార్యదర్శి బడుగు జనార్దన్ ఎర్రగుంట్ల బాలయ్య గుంటగాని స్టీఫెన్ మార్కండేయులు దార్ల సూర్యనారాయణ ఎర్రగుంట్ల నారాయణ వెంగయ్య యోగయ్య తదితరులు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

- ప్రకాశం జిల్లా ఎస్పీ ఆర్ దామోదర్
- టంగుటూరు పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-టంగుటూరు : పోలీస్ స్టేషన్ స్థితి గతులు సిబ్బంది పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించుటకు టంగుటూరు పోలీస్ స్టేషన్ ను మంగళవారం జిల్లా ఎస్పీ ఆర్ దామోదర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్లోని పలు రికార్డులను పరిసరాలను పరిశీలించి పెండింగ్ కేసులు దర్యాప్తు ఏ విధంగా జరుగుతున్నది ఆరా తీసి కేసుల ఛేదనకు దోహదపడే దర్యాప్తు విధానాలపై టంగుటూరు పోలీసులకు ఎస్పీ సూచనలు చేశారు. స్టేషన్లో నిర్వహించే రికార్డ్స్ పెండింగ్ లేకుండా సక్రమంగా నిర్వహించాలని సిబ్బంది కి తెలిపారు. స్టేషన్ పరిధిలో గ్రామాలలో పోలీసు అధికారులు నిత్యము పర్యటిస్తూ అక్కడి సమస్యలను పరిష్కరించి శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చూడాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకొని శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ పడవద్దని సిబ్బందికి హెచ్చరికలు జారీ చేశారు. సైబర్ నేరాలు ఆన్లైన్ మోసాలపై నూతన చట్టాలు మాదకద్రవ్యాలు వినియోగం వలన కలిగే దుష్ప్రభావాలపై ప్రజలకు పాఠశాలలు కాలేజీల్లో క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సిబ్బందికి తెలియజేశారు. పోలీస్ స్టేషన్లోని సిబ్బందితో మాట్లాడి వారి పనితీరు వారు ఏ ఏ ప్రాంతాలలో విధులు నిర్వహిస్తున్నారు అక్కడ ఎటువంటి పరిస్థితులు ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వారికి కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని వృత్తి నైపుణ్యం పెంచుకోవాలని సాంకేతికంగా ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రతిరోజు పోలీస్ స్టేషన్ ను పరిశుభ్రంగా ఉంచాలని వారానికి ఒకసారి శ్రమదాన కార్యక్రమం నిర్వహించాలన్నారు.

సిబ్బందికి ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని తెలిపారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదు దారులతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ జవాబుదారీతనంగా ఉండాలన్నారు. మహిళాలు, పిల్లలు సంబంధిత ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (క్రైమ్) ఎస్.వి.శ్రీధర్ రావు, సింగరాయకొండ సిఐ డి.రంగనాథ్, టంగుటూరు ఎస్సై పున్నారావు, మరియు టంగుటూరు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు ప్రారంభం

కామూరి రమణారెడ్డి

విశాలాంధ్ర-కొమరోలు : మండలంలోని బాధినేనిపల్లి గ్రామంలో మొహరం పండుగను పురస్కరించుకొని రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలను కొమరోలు ఎంపీపీ కామూరి అమూల్య ప్రారంభించారు. బండలాగుడు పోటీలను ప్రారంభించిన ఎంపీపీ అమూల్యను గ్రామస్తులు శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. మొహరం పండుగను పురస్కరించుకొని మనోజ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కామూరి రమణారెడ్డి భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అన్నదానానికి సహకరించిన కామూరి రమణారెడ్డికి మొహరం పండగ వేడుకలు నిర్వహణ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మొహరం పండగ వేడుకలకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చారు.

చోరీలతో బెంబేలెత్తిపోతున్న రైతన్నలు

విశాలాంధ్ర-కొమరోలు : మండలంలోని చింతలపల్లి మరియు కూరా కువాని పల్లి గ్రామ పరిసర ప్రాంతాలలోని పొలాలలో మోటార్ స్టార్టర్లను గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడుతున్నారు. ఈ విషయాన్ని స్థానిక రైతులు వెల్లడించారు. ఇప్పటికే ఐదు మోటార్ స్టార్టర్లు దొంగలు దొంగిలించారని ఆర్థికంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కొక్క స్టార్టరు 5 వేలకు పైగా ఖరీదు చేస్తుందని చెప్పారు. పోలీసులు దొంగతనాలు అరికట్టి రైతన్నలకు మేలు చేయాలని వేడుకుంటున్నారు.

ఆధార్ నమోదు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : గ్రామాల్లోని సచివాలయాలలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాలను ప్రజలు తమకు అవసరమైన ఆధార్ నమోదును సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఆర్ జనార్ధన్ తెలిపారు. మండలంలోని పెద్దఉల్లగల్లు, వేముల, సింగనపాలెం సచివాలయాలలో మంగళవారం ఆధార్ నమోదు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ప్రజలకు అవసరమైన అన్ని రకాల సేవలను ప్రభుత్వం నిబంధనలు మేరకు రుసుము వసూలు చేయాలన్నారు. అంతకుమించి ఎలాంటి నిబంధన లు అతిక్రమించినట్లయితే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్ లు అద్దంకి శ్రీనివాసరావు, ఇజ్జగిరి వీరబ్రహ్మం, మొగిలి అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నోట్ బుక్స్ పంపిణీ

విశాలాంధ్ర- చీమకుర్తి: చీమకుర్తి గవర్నమెంట్ కాలేజ్ నందు ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన నోటు పుస్తకములను టిడిపి బాపట్ల పార్లమెంటు ఉపాధ్యక్షులు మన్నం ప్రసాద్ మంగళవారం పంపిణీ చేయుట జరిగినది. ప్రిన్సిపాల్ ఇంకొల్లు శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా కాలేజ్ డెవలప్మెంట్ కమిటీ అధ్యక్షులు మన్నం ప్రసాద్, కమిటీ మెంబర్లు పరాంకుశం శ్రీనివాసమూర్తి, అవనిగడ్డ శేషయ్య,నూకల సుబ్రహ్మణ్యం పాల్గొని నోట్ పుస్తకములను విద్యార్థులకు పంపిణీ చేయుట జరిగినది. ఈ సందర్భంగా మన్నం ప్రసాద్ మాట్లాడుతూ కాలేజీకి అవసరమైన సదుపాయాల కల్పనకు మా సహకారం ఉంటుందని చెప్పారు.

ఎడ్ల పోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ

విశాలాంధ్ర-కొమరోలు : బాధినేని పల్లె గ్రామంలో మంగళవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీల్లో గెలుపొందిన విజేతలకు మండల అధ్యక్షురాలు కామూరి అమూల్య మంగళవారం పంపిణీ చేశారు. బాదినేని పల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డ కాసిం స్వామి పీర్ల పండుగ మహోత్సవం సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీల్లో పాల్గొన్న విజేతలకు బహుమతులను అందజేశారు. ఆరు జతలు ఎడ్లు పాలకొనగా వారిలో మొదటి బహుమతి 4033 అడుగుల దూరం లాగి ప్రథమ బహుమతి 40వేలు పొందిన సూరారం రెడ్డి పోతిరెడ్డి పల్లె గ్రామం కడప జిల్లా దక్కించు కున్నారు. ద్వితీయ బహుమతి 4000 అడుగులలో దూరం లాగిన 30వేలు సుధాకర్ రెడ్డి బాలయ్య పల్లి గ్రామం కడప జిల్లాకు చెందిన జత అలాగే తృతీయ బహుమతి 3400 అడుగుల దూరం లాగిన మూల ప్రసాద్ రెడ్డి శ్రీకాంత్ రెడ్డి పొత్తిరెడ్డి పల్లె రాజంపేట కడప జిల్లా 20వేలు నాలుగో బహుమతి 3240 అడుగుల దూరం లాగి 10వేలు తుమ్మల నారాయణరెడ్డి గుడిపాడు కడప జిల్లా జిల్లాకు చెందిన ఎద్దులు ఐదో బహుమతి 3200 అడుగుల దూరం లాగిన పెద్ది శివకాంత్ రెడ్డి కామనూరు మౌలాల చాగలమర్రి నంద్యాల జిల్లా ఆరో బహుమతి 2038 అడుగుల దూరం లాగి 50వేలు అయినా వెంకటేశ్వర్లు ప్రకాశం జిల్లా చెందిన వీరందరికీ కొమరోలు మండల అధ్య క్షురాలు కామూరి అమూల్య, బహుమతులు ప్రధానం చేశారు.

సీఎస్‌సీ ప్రత్యేక శిశు ఆధార్ క్యాంపులు

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ వారి ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రతి ఒక్క గ్రామీణ పట్టణాల్లో మండలాల వారీగా కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా ప్రత్యేక శిశు ఆధార్ సేవలు అందించనున్నట్లు జిల్లా కామన్ సర్వీస్ సెంటర్ల అధికారులు వందనం మరియు ప్రమోద్ తెలిపారు. ప్రతి ఒక్క గ్రామాల్లో ఐదు సంవత్సరాలలోపు చిన్నారులకు ఆధార్ నమోదు తప్పనిసరిగా తల్లిదండ్రులు నమోదు చేయించుకోవాలని సూచించారు. కామన్ సర్వీస్ సెంటర్ ల ద్వారా గ్రామీణ పట్టణాల్లో ప్రజలకు అందుబాటులో అనేక రకములైన సేవలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రత్యేక ఆధార్ క్యాంపులు ఈనెల 23వ తేదీ నుండి 27వ తేదీ వరకు అన్ని గ్రామాలలో జరుగుతాయని ఈ క్యాంపు ద్వారా బాల ఆధార్ మరియు మొబైల్ కి ఆధార్ లింకులు చేసుకోవాల్సిందిగా కోరారు. క్యాంపులో భాగంగా మంగళవారం మండలంలోని చదలవాడ గ్రామం మరియు కేసినేని వారి పాలెం గ్రామపంచాయతీలో ఉచితంగా 18 మందికి ఆధార్ నమోదు సేవలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కామన్ సర్వీస్ సెంటర్ ఆధార్ సూపర్వైజర్ గొర్ల గోపి రాజ్, ఐ సి డి ఎస్ సూపర్వైజర్ కె ప్రమీల, రాజ్యలక్ష్మి, కార్యదర్శి విజయ్ కుమార్, వెల్ఫేర్ అసిస్టెంట్ బొమ్మనబోయిన రమేష్, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్‌కి ఇచ్చేది గ్రాంటా? అప్పా? తేల్చండి

కాంగ్రెస్ నేత సయ్యద్ జావీద్ అన్వర్

విశాలాంధ్ర-మార్కాపురం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్లో కేటాయింపులపై మార్కాపురం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సయ్యద్ జావీద్ అన్వర్ స్పందించారు. ఏపీ రాజధాని నిర్మాణానికి నేరుగా సాయం అందిస్తామని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పకపోవడం శోచనీయమన్నారు. మల్టీ లేటరల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీల ద్వారా రూ.15 వేల కోట్ల ఆర్థిక మద్దతు అందిస్తామని కేంద్ర మంత్రి పేర్కొనడం గమనార్హమని అన్నారు. రాజధాని నిర్మాణానికి రూ.15వేల కోట్లు గ్రాంటా?లేక అప్పా? అనేది తేల్చాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గ్రాంట్ రూపం లోనే ఇవ్వాలని సయ్యద్ జావీద్ అన్వర్ కోరారు. పోలవరాన్ని పూర్తి చేస్తామని పదేళ్లుగా కేంద్రం చెబుతోందని అన్నారు. పోలవరానికి నిధులివ్వన్న పాపాన పోలేదని ఆయన విమర్శిం చారు. పోలవరాన్ని నిర్దేశిత సమయంలోపు పూర్తి చేస్తామని ఇప్పటికీ కేంద్ర ప్రభుత్వం చెప్పలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.ఏపీ విభజన సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని,అయినప్పటికీ కేంద్రం మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. పదేళ్లుగా రాష్ట్రానికి ఆర్థికంగా ఫెసిలిటేట్ ఎందుకు చేయలేదని ఆయన ప్రశ్నించారు. అలాగే వెనుకబడిన జిల్లాలైన రాయల సీమ, ప్రకాశం జిల్లాలకు ఎంత మేరకు సాయం చేస్తారనే విషయమై స్పష్టత లేదన్నారు. ప్రస్తుత బడ్జెట్లో పోలవరానికి అవసరమైన నిధులు ఇస్తామన్నారే తప్ప,ఎంత ఇస్తారనే దానిపై కేంద్ర ఆర్థిక మంత్రి క్లారిటీ ఇవ్వలేదన్నారు. ఏపీతో పోలిస్తే బీహార్ రాష్ట్రానికి అత్యధిక ప్రాజెక్టులు ఇచ్చారన్నారు.ఏపీకి అన్యాయం జరిగిందని తేలితే కాంగ్రెస్ పార్టీ సమష్టి పోరాటానికి దిగుతుందని సయ్యద్ జావీద్ అన్వర్ హెచ్చరించారు.

మార్కాపురం ఆకాశవాణిలో క్యాజువల్ అనౌన్సర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర-మార్కాపురం : మార్కాపురం ఆకాశవాణి కేంద్రంలో క్యాజువల్ అనౌన్సర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రోగ్రామ్ హెడ్‌పి ప్రశాంత్ కిరణ్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అభ్యర్థులు మార్కాపురం పట్టణ, పరిసర ప్రాంతాల వారై ఉండాలని, తెలుగుభాషపై పూర్తి అవగాహన, మంచి కంఠ స్వరం కలిగివుండాలని, ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా డిగ్రీ పాసై ఉండాలని, తెలుగుసాహిత్యం, చరిత్ర, సంస్కృతి సమకాలిన రాజకీయ, ఆర్థిక అంశాలు పట్టు కలిగివుండాలని, గుర్తింపు పొందిన సంస్థలనుంచి కంప్యూటర్ పరిజ్ఞానం సర్టిఫికెట్లు ఉండాలని అన్నారు. 2024 సెప్టెంబరు 1 తేదీ నాటికి 20 సంవత్సరాల నుంచి 50 యేళ్లలోపు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. అభ్యర్థులు పూర్తిచేసిన దరఖాస్తులతోపాటు 10వ తరగతి, డిగ్రీ సర్టిఫికేట్ జిరాక్స్ కాపీలు, లేటెస్టు పాస్పోర్టు సైజు 3 ఫోటోలు, ఆధార్కార్డు జిరాక్స్ జత చేసి పంపాలని అన్నారు. ఓపెన్ క్యాటగిరి అభ్యర్థులు 854 రూపాయలు, ఎస్సి, ఎస్టి, ఈబిసి అభ్యర్థులు 266 రూపాయలు బ్యాంకు అకౌంట్ నెంబరు 31122924901 – ఐఎఫ్ఎస్సి కోడ్ ఎస్‌బిఐఎన్0003055 నెఫ్టేరా చెల్లించి రసీదును జతపరచాలి. ఎస్సి, ఎస్టి, ఈబీసీ అభ్యర్థులు తమ ధృవీకరణ పత్రాలు అటెస్టేషన్ చేయించి దరఖాస్తు ఫారముతో జతపరచాలి. అభ్యర్థుల చిరుమానా, ఫోన్ నెంబరు, మెయిల్ ఐడిని దరఖాస్తు ఫారంలో నింపాలి. అభ్యర్థుల ఎంపిక మూడుదశల్లో ఉంటుందని, రాత పరీక్ష, స్వర పరీక్ష, ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేస్తామని అన్నారు. రాత పరీక్షల్లో ఎంపికైన అభ్యర్థులను వాయిస్ టెస్టుకు పిలుస్తామని, ఈ రెండు పరీక్షల్లో పాసైన వారిని ఇంటర్వ్యూకు పిలుస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థుల తమ బయోడెటాను వచ్చేనెల 5వ తేదీ సాయంత్రం 6 గంటలలోగా మార్కాపురంలోని ఆకాశవాణి కేంద్రానికి చేర్చాలని అన్నారు. ఈ నియామకాలన్నీ ఆసైన్ మెంట్ పద్ధతిలోనే ఉంటాని తెలిపారు. శాశ్వత ఉద్యోగాలు కావని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు షిఫ్ట్ పద్ధతిలో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. పూర్తిచేసిన దరఖాస్తులను వచ్చేనెల 5వ తేదీలోపు మార్కాపురంలోని ఆకాశవాణి కేంద్రానికి

తహశీల్దార్ నెల్లూరుకు బదిలీ

విశాలాంధ్ర - యద్దనపూడి: మండల తహ శీల్దార్ వై.నాగ రాజు నెల్లూరు జిల్లాలోని సంగం మండలంకు బదిలీపై వెళ్లారు. ఎన్నికలకు ముందు యద్దనపూడి మండలంలో బాధ్యతలు స్వీకరిం చారు. ఆయనను టిడిపి నాయకులు నల్లపనేని రంగయ్య చౌదరి, గుదే తారక రామారావు, కొరటాల వంశీకృష్ణ , శాలువా కప్పి సత్కరించారు. తహసిల్దార్ కార్యాలయం సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు. ఇన్చార్జి తహసిల్దారుగా మస్తాన్‌రావు బాధ్యతల స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వివోఆర్‌డి సిహెచ్ శ్రీనివాసరావు, ఎంఈఓ సిహెచ్ గోపి, డిప్యూటీ తహసిల్దార్ విష్ణు, వీఆర్వో సత్యనారాయణ వీఆర్‌ఏ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

విశాలాంధ్ర - చీరాల : బాల్య వివాహాల వలన వాటిల్లే దుష్ఫలితలపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని బాపట్ల జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాదేవి అన్నారు. మంగళవారం కేజీఎం గర్ల్స్ హైస్కూల్ చీరాలలో బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాపట్ల జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాదేవి,ప్రాజెక్ట్ ఆఫీసర్ స్వప్న ప్రియ, కౌన్సిలర్ రోజ్ లీనా మాట్లాడుతూ బాల్య వివాహాలు, బాలికా సంరక్షణ, బాలల హక్కులు తదితర చట్టాలపై అవగాహన కలిగుండాలని అన్నారు. యుక్త వయస్సు వచ్చాక పెళ్ళిచేసుకోవాలని ఆర్థిక శక్తి వచ్చాక పెళ్లి చేసుకోవాలని అన్నారు. బాల్య వివాహాలు చట్ట వ్యతిరేకమని చిన్నారుల జీవితాలు బాల్యంలో చిదిమేస్తే చట్టపరంగా చర్యలు ఉంటాయని విద్యార్థినిలు బాల్యవివాహాలపై అవగాహన ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి కృష్ణమోహనరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రిక్షాకార్మికులకు రెయిన్ కోట్లు పంపిణీ

విశాలాంధ్ర - రేపల్లె : వర్షాకాల సమయంలో ఇబ్బంది పడి ఉపాధి కోల్పోకుండా పట్నంలోని రిక్షా కార్మికులకు మంగళవారం ఎన్నారై శ్రీనాథ్ రెయిన్ కొట్లు పంపిణీచేశారు. స్థానిక రేపల్లె సిఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రేపల్లె రైల్వే స్టేషన్ రిక్షా స్టాండ్ పరిధిలో 25మంది రిక్షాకార్మికులకు రెయిన్ కోట్స్ పంపిణీచేయడం జరిగిందని ఎన్నారై శ్రీనాథ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో దాత పరుచూరి.శ్రీనాథ్ నిర్వాకులు, సిఐటియు బాపట్ల జిల్లాఅధ్యక్షులు సిహెచ్. మణిలాల్, మాట్లాడుతూ కష్టపడి రిక్షాకార్మికులకు జీవనం గడుపుతునా పేదలు వర్షాకాలం సమయంలో వర్షంవల్ల ఉపాధి కోల్పోకుండా రెయిన్ కోట్స్ ఉపయోగపడతాయని అన్నారు. అందరూ ఐక్యంగా కలిసిఉండాలని, మంచి ఆరోగ్యం ఉంటే అదే పెద్ద సంపద అని పలు సూచనలు చేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో సిఐటియు రేపల్లె పట్టణ అధ్యక్షులు కె జె.ధర్మరాజు,రిక్షా వర్కర్ యూనియన్ నాయకులు ఎం వెంకటేశ్వరరావు, యార్లగడ్డ రాంబాబు, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

జనసైనికుల సంక్షేమం.. జేఎస్పీ లక్ష్యం

విశాలాంధ్ర-పర్చూరు: జనసేన పార్టీ లక్ష్యం జనసైనికుల సంక్షేమమని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి పెదపూడి విజయకుమార్ తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం జేఎస్పీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమంను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆరున్నర లక్షల సభ్యత్వ నమోదు లక్ష్యంగా పార్టీ స్వచ్చంద కార్యకర్తలు పనిచేస్తున్నారని, ఈనెల 28 వరకు నమోదు కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. సభ్యత్వం కలిగిన వారికి రూ.5 లక్షలు ప్రమాద బీమా సదుపాయం కలదని తెలిపారు. ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జేఎస్పీ నియోజకవర్గ నాయకులు మన్నెం శ్రీకాంత్ మాట్లాడుతూ జేఎస్పీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా పార్టీ అభ్యున్నతికి కృషిచేయాలని, డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమంను పర్చూరులో ప్రతి శనివారం నిర్వహించాలని ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. అన్నదానం మొత్తం 250 వారాలు నిర్వహించాలని, దానిలో 50 వారాలకు తమ ఆర్థిక సహకారం అందిస్తామని తెలిపారు. పార్టీ నాయకులు కటారి సురేంద్ర, కారంపూడి సందీప్‌తేజ, మణి, అజయ్, చంటి, సతీష్, తులసి అప్పారావు, ఆర్.ఆంజనేయులు, జెట్టి హరిబాబు ఉన్నారు.

గణితంపై ఆసక్తిని పెంపొందించుకోవాలి

విశాలాంధ్ర - అద్దంకి : గణితం పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని మండల విద్యాశాఖ అధికారి బి.సుధాకర్ రావు విద్యార్థులకు సూచించారు. బాపట్ల జిల్లా విద్యాశాఖ అధికారి సమగ్ర శిక్ష ఏపీసి సూచనల మేరకు మండలంలోని తిమ్మాయపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నందు మంగళ వారం పునాది అభ్యసన మరియు సంఖ్యాశాస్త్రం నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమం విజయవంతంగా అమలు చేయడానికి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఈఓ సుధాకర్ రావు మాట్లాడుతూ పునాది అభ్యసన సంఖ్యాశాస్త్రం నైపుణ్యాల అభివృద్ధి గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈనెల 29వ తేదీ వరకు వారం రోజులపాటు మండలంలోని అన్ని పాఠశాలల్లో శిక్ష సప్తాహ్ కార్యక్రమాన్ని నిర్వహించాలని తెలియజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల కాంప్లెక్స్ చైర్మన్ గంగాధరరావు మాట్లాడుతూ నిత్య జీవితంలో గణితం చాలా ముఖ్యమైనదని గణితం పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సర్వేశ్వరరావు ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ



విశాలాంధ్ర - అద్దంకి : రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ ఆధ్వర్యంలో కొల్లిపర నాగయ్య మల్లాది శ్రీనివాసరావు గార్ల సౌజన్యంతో మంగళవారం పట్టణంలోని కాకాని పాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు 7వేలు విలువచేసే నోట్ బుక్స్, పెన్నులు, హ్యాండ్ వాష్ బాటిల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య మాట్లాడుతూ రోటరీ క్లబ్ స్నేహం సేవా సహకారం అనే సూత్రాలతో ప్రపంచ వ్యాప్తంగా 200 దేశాలలో పనిచేస్తున్నదని మండలంలోని పాఠశాలలకు అవసరమైన కుర్చీలు బీరువాలు నోట్ బుక్స్ సమకూర్చడంలో సహకరిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ బాల్యం నుంచి తల్లిదండ్రులను గురువులను పెద్దలను గౌరవించాలని మంచివారిని స్నేహితులుగా చేసుకోవాలని క్రమ శిక్షణతో మెలగాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి చుండూరి మురళి సుధాకర్ రావు ట్రెజరర్ మాలాది శ్రీనివాసరావు రోటరీ క్లబ్ పూర్వ అధ్యక్షులు చిన్ని మురళీకృష్ణ , సంధి రెడ్డి శ్రీనివాసరావు పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ భాస్కర్, విద్యా కమిటీ చైర్మన్ చందు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధికి బీజేపీ ప్రభుత్వం కట్టుబడి ఉంది: అన్నం

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : రాష్ట్ర అభివృద్ధికి బిజెపి ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు వెళుతుందని ఆ పార్టీ నాయకుడు,మాజీ శాసనమండలి సభ్యులు అన్నం సతీష్ ప్రభాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. పార్లమెంట్ సమావేశాలలో తలపెట్టిన బడ్జెట్ సమావేశంలో రాజధాని అభివృద్ధికి రూ.15 వేల కోట్లు మంజూరు చేస్తున్నామని, అవసరమైన నిధులను మరింత మంజూరు చేస్తామని ప్రకటించడం హర్షణీయమన్నారు. గత ఐదు సంవత్సరాల పాలనలో అభివృద్ధిలో వెనకడుగు లో ఉన్న ఏపీని మరింత అభివృద్ధి చేసేందుకు ఐదు సంవత్సరాలలో పూర్తిస్థాయిలో సహకరిస్తామని చెప్పడం సంతోషమన్నారు. సాధ్యమైనంతవరకు పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని, అదేవిధంగా రాయలసీమ, ఉత్తరాంధ్ర, ప్రకాశం అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించారన్నారు. విశాఖ-చెన్నై ఓర్వకల్లు బెంగళూరు పారి శ్రామిక కారిడార్ కు నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించడం గొప్ప విష యం అన్నారు. ఏపీలో పరిశ్రమల ఏర్పాటుకు తోడ్పాటు అందిస్తామని, ఉద్యోగాలు,నైపుణ్య అవకాశాలు కల్పించేందుకు పూర్తిస్థాయిలో ఆంధ్రప్రదేశ్‌కు సహకరిస్తా మని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది అన్నారు. ప్రధానంగా విభజన చట్టానికి కట్టుబడి ఉండడంతో పాటు ఏపీలో ప్రత్యేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు పార్లమెంటులో ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రకటించారని పేర్కొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

విశాలాంధ్ర-పర్చూరు: గ్రామీణ ఉపాధి హామీ పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.రాజేష్ తెలిపారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయం వద్ద మంగళవారం సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. 2023 ఏప్రిల్ నుండి 2024 మార్చి వరకు జరిగిన ఉపాధి పనుల నివేదికలను పరిశీలించారు. పీడీ మాట్లాడుతూ పనులు జరిగే సమయంలో కూలీలు సమయ పాలన పాటించాలని, వేతనాలను సక్రమంగా అందించాలని, అధికారుల పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. సమావేశంలో ఎంపిడిఓ శ్రీనివాసరెడ్డి, ఎంపిపి మేకా ఆనందకుమారి, హెచ్ఆర్ మేనేజర్ చంద్రశేఖర్, ఏపీఓ బుల్లియ్య, సిబ్బంది ఉన్నారు.

సృజనాత్మకతకు క్విజ్ పోటీలు దోహదం

విశాలాంధ్ర-పర్చూరు: విద్యార్థులలో ఉన్న సృజనాత్మకతకు క్విజ్ పోటీలు దోహదపడతాయని విశ్రాంత నవోదయ పాఠశాల ఉపాధ్యాయులు, రేడియో ఆర్టిస్ట్ పిన్నక సాంబయ్య తెలిపారు. మండలంలోని అడుసుమల్లిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం బ్యాంకుల జాతీయ కరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. క్విజ్ పోటీలలో మొదటి బహుమతి అల్లూరి సీతారామరాజు టీంకు, రెండవ బహుమతి నెహ్రూ టీంకు, మూడవ బహుమతి అంబేద్కర్ టీంలు విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

భజన గురువు జొన్నలగడ్డ మృతి

విశాలాంధ్ర - రేపల్లె : సమరసత సేవా ఫౌండేషన్ రేపల్లె మండల భజన ప్రముఖ్ భజన సమాజం భజన గురువుగా నాటక కళాకారుడుగా బ్రహ్మంగారి నాటకంలో సిద్దయ్య, హరిచంద్ర నాటకంలో నక్షత్రకుడు, అర్జునుడు, ఆంజనేయుడు, అనేక పాత్రలు పోషించిన జొన్నలగడ్డ వెంకట్రామయ్య(68) మంగళవారం ఉదయం వారి స్వగృహంలో ఆకస్మికంగా మృతి చెందారు. వీరి మృతికి సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు పేరం కోటేశ్వరరావు, జంజనం హేమ శంకరరావు, శౌంటి బాబూరావు, పదమట వెంకటేశ్వరరావు, సంబారి వేణు, గుంటి సాంబశివరావు, గూడవల్లి కుటుంబరావు, తదితరులు మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

27న సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-పర్చూరు: పర్చూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం 27న శనివారం ఉదయం 10 గంటలకు ఎంపిపి మేకా ఆనందకుమారి అధ్యక్షతన జరుగుతుందని ఎంపిడిఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఎంపిటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు హాజరుకావాలని కోరారు.

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి తీవ్ర అన్యాయం

సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ

విశాలాంధ్ర - బాపట్ల : కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని విభజన హామీలు ఏ ఒక్కదాన్నీ నెరవేర్చలేదని ప్రత్యేక హోదా, పోలవరం, రైల్వే జోన్, మెట్రోరైలు వంటివి ప్రస్తావనే లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ విమర్శించారు. సింగరకొండ మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్లో రాష్ట్రానికి ప్రత్యేక హోదా గురించి ప్రస్తావనలేకుండా, రాజధాని అమరావతికి రూ.15 వేల కోట్లు కేటాయించామని ప్రకటించడం రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసినట్లేనన్నారు. దేశంలో రైతులు అప్పులు చేసి ఆత్మహత్యలు చేసుకుంటుంటే రైతు రుణమాఫీ గురించి బడ్జెట్లో ప్రస్తావన లేకపోవడం బాధాకరమన్నారు. దేశంలో యువత తక్కువ వేతనాలతో పని చేస్తుంటే వారికి కనీస వేతనం అమలు చేస్తామని చెప్పకపోవడం దారుణమన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన ఈ బడ్జెట్ భవిష్యత్తులో సామాన్య ప్రజలపై భారాలు మోపే విధంగా ఉదన్నారు. దక్షిణాది రాష్ట్రాల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టినట్లుగా ఉందని విమర్శించారు. రాయలసీమ అభివృద్ధి చేస్తామని మోసపుమాటలు చెబుతూ, విశాఖ రైల్వే జోన్ గురించి ప్రస్తావించకపోవడం రాష్ట్రానికి అన్యాయం చేసినట్లే అన్నారు. బడ్జెట్లో ఆంధ్ర రాష్ట్రానికి మొండిచేయి చూపించారన్నారు. విశాఖ రైల్వే జోన్ కి సంబంధించి ఎటువంటి ప్రస్తావన లేదన్నారు. రైల్వేస్ పరంగా ఏపీకి ఎటువంటి కేటాయింపులు లేవని ఆంధ్రులను మరోసారి కేంద్రం మోసం చేసిందన్నారు.

పరిశుభ్రత పాటించాలి

విశాలాంధ్ర-గిద్దలూరు : మండలంలోని సంజీవ రావు పేట గ్రామంలో గల బీసీ బాలుర వసతి గృహంలో సంజీవ రావు పేట ప్రాథమిక వైద్యాధికారిని సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సమయ వసతి గృహంలోని బాలురులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ షేక్ సుమయ మాట్లాడుతూ వ్యాధుల నివారణ కొరకు ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా పరిశుభ్రతను పాటించాలని చేతులను ప్రతిరోజు పరిశుభ్రంగా కడుకోవాలని ముఖ్యంగా దోమలపై అప్రమత్తంగా ఉండాలని దోమల వ్యాప్తి నివారణకు జాగ్రత్తలు పరిశుభ్రత ఏకైక మార్గమని కాబట్టి విద్యార్థులు పరిశుభ్రంగా ఉంటూ పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులు వ్యాధుల బారిన పడినప్పుడు వెంటనే స్థానిక ఏఎన్ఎంలు ,ఆశాలు సహకారంతో స్థానిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స తీసుకోవాలని తెలిపారు. అనంతరం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన మందులను ఉచితంగా అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం హెచ్ ఇ ఓ బాదరయ్య, ఏఎన్ఎం లక్ష్మి ఆశాలు హాస్టల్ వార్డెన్ పాల్గొన్నారు

బాల్య వివాహాలపై అవగాహన

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : పుల్లలచెరువు మండలంలోని నాయుడుపాలెం గ్రామంలో మంగళవారం సార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో విల్లెజ్ లెవెల్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ మీటింగ్ నిర్వహించి బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. నాయుడు పాలెం పంచాయతీ కార్యదర్శి జగదీష్ మాట్లాడుతూ ఈ లెవెల్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశంలో అధ్యక్షుడు సర్పంచి ఎంపీటీసీ, పంచాయతీ సెక్రెటరీ, వెల్ఫేర్ అసిస్టెంట్ తదితరులు గ్రామంలో 18 సంవత్సరాల లోపల ఉన్నటువంటి బాలబాలికలకు రక్షణ కవచంగా లాగా ఉండాలని తెలిపారు.

మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు: ఎస్పీ

విశాలాంధ్ర - బాపట్ల : జిల్లాలో ఎవరైనా, ఎక్కడైనా మహిళల పట్ల, చిన్నారుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే చట్టపరంగా తీవ్రమైన కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ తుషార్ డూడి హెచ్చరించారు. జిల్లాలోని నిర్మానుష్య ప్రదేశాలలో, ముఖ్యమైన ప్రాంతాలలో పోలీసు సిబ్బంది గస్తీ నిర్వహించి, అనుమానిత ప్రదేశాలలో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళలు చిన్నారుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తూ నేరాలను నియంత్రించడానికి జిల్లాలో పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేయడానికి, గంజాయి ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణాను, నిల్వలను, వినియోగాన్ని అరికట్టడానికి, ఆకతాయిల ఆగడాలను కట్టడి చెయ్యడానికి ఈరోజు జిల్లా వ్యాప్తంగా పోలీస్ సిబ్బంది పగటి పూట గస్తీ నిర్వహించడం జరిగిందన్నారు. నిర్మానుష్య ప్రదేశాలలో, ఆకతాయిలు ఎక్కువగా ఉండడానికి, నేరాలు జరగడానికి అవకాశం ఉన్న ప్రదేశాలలో పోలీస్ సిబ్బంది విస్తృతంగా గస్తీ నిర్వహించారని తెలిపారు. ప్రధాన కూడళ్ళలో, పాఠశాలలు, కళాశాల వద్ద, ముఖ్యమైన ప్రదేశాలలో పెట్రోలింగ్ నిర్వహించారని తెలిపారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలను రవాణా చేసిన, కలిగి ఉన్న విక్రయించిన అట్టి వారిపై కఠినమైన చర్యలు ఉంటాయన్నారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలకు బానిసలైన వారు వాటి బారి నుండి బయట పడాలనే ఉద్దేశం ఉంటే పోలీస్ శాఖను సంప్రదించాలని సూచించారు. అటువంటి వారికి రీహాబిలిటేషన్ సెంటర్ లకు పంపి కౌన్సెలింగ్ నిర్వహిస్తారని ఎస్పీ తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌పై హర్షం

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : వికసిత ఆంధ్ర ప్రదేశ్ దిశగా కేంద్ర బడ్జెట్ కేటాయింపులు ఆహ్వానిస్తున్నామని ప్రధాని నరేంద్ర మోడీ, ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ కు భాజపా జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం జరిగినా పార్లమెంట్ సమావేశంలో ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ తలపెట్టిన బడ్జెట్ సమావేశంలో ఏపీ రాజధాని అభివృద్ధికి రూ.15 వేల కోట్లు రూపాయలు మంజూరు చేస్తున్నామని, అవసరమైన నిధులను మరింత మంజూరు చేస్తామని ప్రకటించడం హర్షణీయమన్నారు. ఈ బడ్జెట్ ఉత్పాదకత, ఉపాధి, సామాజిక న్యాయం, పట్టణాభివృద్ధి, ఇంధన భద్రత, మౌలిక సదుపాయాలు, నూతన ఆవిష్కరణలు సంస్కరణలు అనే తొమ్మిది అంశాలకు ప్రాధాన్యత ఇచ్చారన్నారు. యువత, మహిళ, గ్రామీణ వ్యవసాయ రంగాలకు, మధ్య తరగతి ప్రజలకు ఊతం ఇచ్చే విధం గా కేంద్ర బడ్జెట్ ఉందన్నారు. పోలవరం నిర్మాణానికి అవసరమైన పూర్తి నిధులను సమకూరుస్తామని ఆర్థిక మంత్రి తెలిపారు. పోలవరం దేశానికి ఆహార భాండాగారమని చెప్పటం పోలవరం ప్రాముఖ్యతను కేంద్ర ప్రభుత్వం గుర్తించిందన్నారు. పూర్వోదయ కింద తూర్పు భారతదేశ మౌలిక సదుపాయాల అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించే రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్‌కి స్థానం కల్పించారన్నారు.

ఆంగ్లేయులకు సింహస్వప్నం ఆజాద్

విశాలాంధ్ర - బాపట్ల : చంద్రశేఖర్ ఆజాద్ బ్రిటిష్ వారి గుండెల్లో నిద్రించి, వారికి సింహ స్వప్నంగా మారారని మండల విద్యా శాఖాధికారి-2 దేవరకొండ ప్రసాదరావు అన్నారు. చంద్రశేఖర్ ఆజాద్ 118 వ జయంతి సందర్భంగా మంగళవారం ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో మండల కార్యాలయం వద్ద గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భారత స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్న తొలి సాయిధ పోరాట యోధుడు ఆజాద్ అన్నారు. లాలా లజపతిరాయ్ మృతికి కారణమైన ఆంగ్లేయ అధికారులపై ప్రతీకారం తీర్చుకొని, భారతీయుల సత్తా ఆజాద్ చాటారన్నారు. ఆయన త్యాగం నిరుపమానమైనదని పేర్కొన్నారు. నేటి యువత ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని దేశాభివృద్ధికి పాటుపడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫోరం కార్యదర్శి డాక్టర్ పిసి సాయిబాబు, న్యాయవాదులు జమ్మద్ భాష, టీ భాస్కర్ రావు, కోర్నెయలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల చేతిలో ఆయుధం సమాచార హక్కు చట్టం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : ప్రజల చేతిలో ఆయుధం సమాచార హక్కు చట్టం 2005 అని ఎంపీడీవో శోభారాణి అన్నారు.చీరాల మండల ప్రజా పరిషత్ అభివృద్ధి కార్యాలయంలోని సమావేశ మందిరంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చట్టం ఉపయోగాలు, లక్ష్యాలు, వివరించి ప్రతి ఒక్కరూ చట్టం ద్వారా తమకు కావలసిన సమాచారాన్ని పొందవచ్చన్నారు. డిప్యూటీ తహశీల్దార్ సురేష్ బాబు మాట్లాడుతూ ఈ చట్టం అమలు గురించి తెలిపారు. అధికార యంత్రాంగం నియంత్రణలో ఉన్న సమాచారాన్ని పొందవచ్చునన్నారు. చట్టం యొక్క ముఖ్య ఉద్దేశ్యం అధికార యంత్రాంగంలో పారదర్శకత, జవాబుదారితనం తీసుకురావటం, అవినీతిని అరికట్టటం అని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి ఐ సుమతి మాట్లాడుతూ పౌర సమాచార అధికారుల పేర్లు, హోదాలు, ఇతర వివరాలతో సమాచార హక్కు చట్టం నోటీసు బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి ఏడాది తాజా సమాచారంతో నవీకరణ చేయాలన్నారు. చట్ట పరిధిలోకి ప్రభుత్వం స్థాపించిన, నియంత్రణలో ఉన్న, ప్రత్యక్షంగానో పరోక్షంగానో నిధులు పొందుతున్న అధికార యంత్రాంగాలు వస్తాయన్నారు. సమాచారం కోసం ప్రభుత్వ కార్యాలయంలో ఉన్న బోర్డులో ఉన్న అధికారికి దరఖాస్తు ఇచ్చి పొందవచ్చునని తెలిపారు. దరఖాస్తుకు నిర్దిష్ట నమూనా అంటూ ఏమీ లేదని, భారతీయులు ఎవరైనా తెల్ల కాగితంపై సమాచారం కోసం విన్నపము అని వ్రాసి, నగదు, బ్యాంక్ డ్రాఫ్ట్, పోస్టల్ ఆర్డరు, చెక్కు ద్వారా చెల్లించిన దరఖాస్తు రుసుముతో సమర్పించాలన్నారు. అధికారికి సమాచారం ఎందుకు అని అడిగే అధికారం లేదని తెలిపారు. సమాచారం కోసం దరఖాస్తుదారుడికి 30 రోజుల కాలపరిమితి ఉంటుందన్నారు.దరఖాస్తు సమాచారం మరో అధికార యంత్రాంగానికి సంబంధించినది అయితే ఆ దరఖాస్తును వారికి పంపాలని ఆ విషయాన్ని దరఖాస్తుదారునికి ఐదు రోజులలోపు తెలియచేయాలన్నారు. అనంతరం ఆర్ టీ ఐ రిసోర్స్ పర్సన్ దాసరి ఇమ్మానియేల్ సమాచార హక్కు చట్టంలో ఉన్న 31 సెక్షన్స్ గురించి ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. చట్టం గురించి పౌరులందరికీ అవగాహన ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ సరిత, హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఏఈ పురుషోత్తం, ఎలక్ట్రిసిటీ ఏఈ పి రామ్ కుమార్, జేఈలు శ్యాంసుందర్, ఎల్ బ్రహ్మం, పీహెచ్ సి వైద్యులు సిహెచ్ శ్రీదేవి, పశు వైద్యాధికారి డాక్టర్ వై పావని, ఏఈ ఆర్ డేనియల్, ఈ ఓ ఆర్ డీ బండారు మురళీ బాపూజీ, తెదేపా నాయకులు సుబ్బలక్ష్మి, గుద్దంటి చంద్రమౌళి, ఆదర్శ రైతు గుర్రం వెంకటేశ్వర్లు, గ్రామస్థాయి అధికారులు, కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులు, వీఏఎలు, విహెచ్ ఏలు, ప్రజలు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకంపై రైతులకు అవగాహన సదస్సు

విశాలాంధ్ర-తర్లుపాడు : మండల కేంద్రమైన తర్లుపాడులోని స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో బి చంద్రశేఖర రావు అధ్యక్షతన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటలు మంజూరు అయిన రైతులకు పండ్ల తోటలో పెంపకం పై అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా అగ్రికల్చర్ కోర్స్ డైరెక్టర్ రాజేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ పండ్ల తోటలో అంతర్గత పంటలు వేసుకోవచ్చని అన్నారు. సకాలంలో పంటలు వేసుకొని వాటికి ఎలాంటి తెగుళ్లు సోకకుండా ముందుతీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. పండ్ల తోట యజమానులు ప్రారంభం నుంచి చివరి వరకు పాటించవలసిన సూచనలను తెలియజేశారు. ఉపాధి హామీ పథకం కింద సన్న చిన్న కారు రైతులకు పండ్ల తోటలను మంజూరుచేయడంజరిగిందన్నారు. పండ్ల తోటలను నాటి నాటి నుండి మూడు సంవత్సరాల వరకు మెయింటెనెన్స్ ఖర్చులు ప్రభుత్వం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇలాంటి అవకాశాలను ప్రతి పండ్ల తోటలరైతులుఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ రాజేష్, ఎంపీడీవో బి చంద్రశేఖర రావు, ఏపీవో చిన్న కొండయ్య, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ పెద్దయ్య, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

బాలగంగాధర్ తిలక్ జయంతి

విశాలాంధ్ర-తర్లుపాడు : స్వాతంత్ర సమరయోధుడు బాలగంగాధర్ తిలక్ జయంతి వేడుకలు తర్లుపాడు మండలం కలుజువ్వలపాడు పంచాయతీలోని లక్ష్మక్క పల్లి గ్రామంలోని మండల ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ప్రధానోపాధ్యాయుడు కసెట్టి జగన్ బాబు, ఉపాధ్యాయుడు షేక్ అబ్దుల్ సుకుర్ తిలక్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానో పాధ్యాయుడు కసెట్టి జగన్ మాట్లాడుతూ బాలగంగాధర్ తిలక్ జాతీయ ఉద్యమ పితామహుడుగా పేరుపొందడన్నారు. జాతీయోద్యమంలో బ్రిటిష్ వారిని ఎదిరించిన మహానాయకుడుగాపేరుపొందారన్నారు. కార్యక్రమంలో పార్సల్ ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంతో అవినీతి బట్టబయలు: ఏడీపీ

విశాలాంధ్ర-కొల్లూరు : ప్రభుత్వ సంస్థల్లో జరిగే అవినీతిని బట్టబయలు చేసి ప్రజలకు నీతి వంతమైన పరిపాలన అందజేయడానికి సమాచార హక్కు చట్టం దోహద పడుతుందని రేపల్లె ఏడీపీ హుసేన్ అన్నారు. మంగళవారం కొల్లూరు మండలపరిషత్తు కార్యాలయంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సహ చట్టంపై మండల స్థాయి అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ రంగ సంస్థల్లో జరిగే అక్రమాలు, అవకతవకలను సమాచార హక్కు చట్టాన్ని వినియోగిం చుకొని వెలుగులోకి తీసుకొచ్చే అవకాశం ప్రజలకు కల్పించడం ద్వారా పారదర్శకమైన పాలనకు అవకాశం ఏర్పడిందన్నారు. సమాజంలో సమర్థవంతమైన పరిపాలన జరగడానికి ఉపయోగపడే సమాచార హక్కు చట్టాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈసందర్భంగా సూచించారు. సమావేశంలో ఎంఈఓ జ్యోతి, ఏఓ వెంకటేశ్వరరావు, డీటీ నిరంజన్, ఇరిగేషన్ ఏఈ సాంబశివరావు, ఈఓపీఆర్డీ రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతులు అధైర్యపడవద్దు: డీఏఓ

విశాలాంధ్ర-కొల్లూరు : నదీ పరివాహక గ్రామాల రైతులు వరదలు కారణంగా పంట నష్టం వాటిల్లుతుందన్న ఆందోళ నతో అధైర్యపడవద్దని జిల్లా వ్యవసాయ శాఖాధికారి రామకృష్ణ అన్నారు. మంగళవారం కొల్లూరు మండల పరిధిలోని కృష్ణా నదీ పరివాహక గ్రామాలలో పర్యటించిన ఆయన పంటలను పరిశీలించి వరదల కారణంగా ఏఏ పంటలకు నష్టం వాటిల్లుతుందన్న అంశాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. నదికి 5 లక్షలకు మించి వరద నీరు వచ్చిన పక్షంలో పంటలు నీట మునిగి నష్టం వాటిల్లుతుం దని రైతులు ఆయనకు తెలపడంతో ప్రస్తుతం అంత పెద్దమొత్తంలో నీరు వచ్చే అవకాశం లేనందున రైతాంగం ఆందోళనకు గురిచెందాల్సిన అవసరం లేదన్నారు. ఒక వేళ రానున్న రోజుల్లో వరదలు సంభవించి పంట నష్టం వాటిల్లిన పక్షంలో ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో రేపల్లె ఏడీపీ హుసేన్, ఏఓ ఆర్. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రాయితీపై కంది, వరి విత్తనాలు

విశాలాంధ్ర-దొనకొండ: ఖరీఫ్‌లో మొదటి విడతగా మండలానికి 130 క్వింటాళ్ళ విత్తనాలు మంజూరైనట్లు మండల వ్యవసాయాధికారి ఎన్.లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలోని రైతు సేవా కేంద్రంలో సీసీఆర్సీ కార్డులపై అవగాహన కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొని మాట్లాడుతూ కందులపై 30 శాతం రాయితీ, వరి కేజీపై రూ.5 రాయితీ అందిస్తున్నట్లు తెలిపారు. కావాల్సిన రైతులు పొలం పాసు పుస్తకం, ఆధార్ కార్డు నకళ్ళతో ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకుని రైతు వాటా చెల్లించాలని తెలిపారు. అవసరమైన రైతులకు సరిపడా విత్తనాలు తెప్పిస్తామని, మండల రైతులు ఈ అవకా శాన్ని సద్వినియోగం చేసుకోవాలంటూ ఏఓ తెలిపారు.

సమీకృత కలెక్టరేట్ భవనానికి స్థల పరిశీలన

విశాలాంధ్ర - బాపట్ల : సమీకృత కలెక్టరేట్ భవనానికి అవసరమైన స్థలాన్ని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి పరిశీలించారు. బాపట్ల జిల్లా కలెక్టరేట్ నూతన భవన నిర్మాణానికి అవసరమైన ప్రభుత్వ స్థలాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ప్రస్తుతం కలెక్టరేట్ కొనసాగుతున్న ప్రాంతం 57.17 ఎకరాల విస్తీర్ణంలో ఉందని కలెక్టర్‌కు అధికారులు వివరించారు. కలెక్టరేట్ పరిధిలోని భూమికి సంబంధించిన దస్త్రాలు, మ్యాప్‌లను ఆయన పరిశీలించారు. ప్రస్తుతం కలెక్టరేట్ భవనం 57 ఎకరాలలో విస్తరించి ఉండటంతో ఆ భూమి సరిహద్దులలో ఆయన పర్యటించారు. తదుపరి ప్యాడిసన్ పేటలో ఖాళీగా ఉన్న 54.16 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆయన పరిశీలించారు. అనంతరం మూలపాలెంలోని వైద్య కళాశాల భవనం వద్ద ఉన్న భూమిని ఆయన పరిశీలించారు. కర్లపాలెం సత్యవతిపేటలోని తాటితోపు స్థలాన్ని పరిశీలించారు. ఆయన వెంట జిల్లా రెవిన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, బాపట్ల ఆర్డీఓ రవీందర్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారులు, తదితరులు ఉన్నారు.

అన్ని దానాల కన్నా విద్యాదానం గొప్పది: ఎంఈఓ

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : అన్ని దానాల కన్నా విద్యాదానం గొప్పదని మండల విద్యాశాఖాధికారి ఎస్.నిరంజన్ పేర్కొన్నారు. మండలంలోని చెరువు జమ్ములపాలెం ఎన్ చర్చి మండల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఎన్‌జీఓస్ అసోసియేషన్ కోశాధికారి పానకాల రాయుడు సౌజన్యంతో మంగళవారం నోటుపుస్తకాలు, పలకలు, పెన్నులు పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.ప్రకాశ వర్దిని అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎంఈఓ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు అందజేయటం అభినందనీయమన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నతంగా ఎదగాలన్నారు. చదువుతోనే ఉన్నత విలువలు లభిస్తాయన్నారు. బిడ్డల చదువులపట్ల తల్లిదండ్రులు కూడా బాధ్యత తీసుకోవాలన్నారు. అప్పుడే పిల్లలు చదువుపట్ల శ్రద్ధ చూపుతారన్నారు. దాతల సహాయం పొందే విద్యార్థులు భవిష్యత్తులో 10 మందికి దానం చేసేవిధంగా ఉద్యోగ ఉపాధి పొందాలంటే చదువుతోనే సాధ్యమని చెప్పారు. దాత పానకాల రాయుడు మాట్లాడుతూ ప్రతిసంవత్సరం ప్రభుత్వ పాఠశాలకు తాను పుస్తకాలు అందిస్తున్నానని ఈ కార్యక్రమాన్ని ఇదేవిధంగా కొనసాగిస్తానని చెప్పారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ బీవీఎస్ నారాయణభట్టు, ఉపాధ్యాయురాలు జోగి శ్యామ సుందరి, జే సి ఎన్ ఎం సొసైటీ చైర్మన్ కన్నెగంటి జాన్ వెస్లీ,అంగన్వాడీ కార్యకర్తలు, మెర్సి, సోనీ, సిబ్బంది కీర్తన విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పోలీస్ సేవలు వినియోగించుకోవాలి: ఎస్సై

విశాలాంధ్ర-పొన్నలూరు : గ్రామాల్లో ప్రజలు పోలీస్ సేవలు వినియోగించుకోవాలని మంగళవారం స్థానిక ఎస్సై రాజారావు తెలిపారు. ప్రజలు పోలీస్ సేవలను అవగాహన పరుచుకుని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. నిత్యం రోడ్డు ప్రమాదాల రూపంలో కొన సాగుతున్న మరణ మృదంగాన్ని వాహనదారులు హెల్మెట్ ధరించుకోకపోవడం అతిగా మద్యం సేవించి నిర్లక్ష్యంగా వాహనాలు నడపడమే కారణం అవుతున్నాయని మద్యం మత్తు కారణంగా ప్రమాదాలు నివారించేందుకు పోలీ సులు తనిఖీలు చేసినప్పటికీ ఫలితాలు అనుకూలంగా రావడం లేదు. రోజురోజుకు ప్రమాదాల సంఖ్య పెరుగు తుండడంతో కఠిన వైఖరి అవలంబిస్తున్నారు నిత్యం శ్వాస నిర్ధారణ పరీక్షలు చేసి తాగి వాహనాలు తోలుతున్నట్లు తేలితే కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తామన్నారు. మద్యం ఆరోగ్యానికి ముప్పు అని మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రమాదమని నిత్యం వివరిస్తూనే ఉన్నారు. అయినా ఎవరు అవలంభించడం లేదు. పెద్దలు, యువత, నిరక్షరాసులు అందరూ ఇదే తీరిన వ్యవహరిస్తూ ట్రాఫిక్ నిబంధనలను అనుసరించడం లేదు. ఫలితంగా రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతున్నాయి ఇటువంటి పరిస్థితి అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. మద్యం తాగి రోడ్డుపైకి వాహనాలతో వస్తామంటే పోలీసులు కుదరదు పొమ్మంటున్నారు. ఈ నేపథ్యంలో నిత్యం తనిఖీలు నిర్వహించడం వాహన సోదరులకు బ్రీతింగ్ అనలైజర్‌తో తనిఖీలు చేయడం మద్యం సేవించి వాహనాలు నడిపి నిబంధనలను అధిగమించ వద్దని పోలీసులు సూచిస్తున్నారు. మరి కొన్ని చోట్ల కుటుంబ సభ్యుల పైన ప్రమాణాల సైతం చేస్తున్నారు. తీరు మారకపోతే కేసులు నమోదు చేస్తామంటున్నారు.

కూలి డబ్బులు వెంటనే చెల్లించాలి

విశాలాంధ్ర - కొరిశపాడు : మండల కేంద్రంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మిక సంఘం నాయకులు మొండ్రు ఆంజనేయులు ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలి డబ్బులు వెంటనే చెల్లించాలని ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు అనంతరం అధికారులను ఉద్దేశించి వెంటనే పనిచేసిన డబ్బులు చెల్లించాలని, రోజువారి కూలి చేసుకొని బతికే పేదలకు డబ్బులు చెల్లించకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం అని విమర్శించారు. వెంటనే అధికారులు స్పందించి ఈ సమస్య పరిష్కారం చేయాలని వినతి పత్రం అందించి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొరిశపాడు గ్రామాలలో ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

అధికారి వేధింపులకు టెక్నికల్ అసిస్టెంటు ఆత్మహత్యాయత్నం

విశాలాంధ్ర-మార్కాపురం : మండల కేంద్రమైన పుల్లలచెరువు ఎంపిడిఓ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంటుగా పనిచేస్తున్న జమ్ములమూడి రాజ్‌కుమార్ మంగళవారం ఉదయం మార్కాపురం మండలంలోని గజ్జలకొండ గ్రామంలోని తన స్వగృహంలో భోజనంలో పురుగుమందు కలుపుకుని తిని ఆత్మహత్యకు పాల్పడినట్లు బంధువులు తెలిపారు. వెంటనే పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించి చికిత్స అందచేశారు. రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం టెక్నికల్ అసిస్టెంటు, సూపర్వైజరుగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న నక్కా నాగేశ్వరరావు రాజ్‌కుమార్‌తో పాటు మరో నలుగురిపై ఉపాధిహామీ పథకంలో పనిచేయకుండా డబ్బులను ప్రజల అకౌంట్లకు మళ్లించాడనే ఆరోపణలపై మార్కాపురం ఏపిడి నిర్మలను విచారణ అధికారిగా జిల్లా అధికారులు నియమించారు. ఏపిడి నిర్మల విచారణకు హాజరకాకుండా అక్కడే పనిచేస్తున్న సూపర్వైజరు నక్కా నాగేశ్వరరావును విచారణకు పంపారు. అయితే నాగేశ్వరరావు నలుగురు వద్ద లంచాలు తీసుకుని వారికి ఇచ్చి తాను ఇవ్వకపోవడంతో వ్యతిరేకంగా రాసాడని ఆరోపిస్తూ మానసిక వేదనతో ఆత్మహత్య యత్నానికి ప్రయత్నించినట్లు తెలిపారు. ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటన ఉపాధి హామీ వర్గాల్లో సంచలనం కలిగించింది.

విమానాశ్రయాన్ని పరిశీలించిన కలెక్టర్



విశాలాంధ్ర-దొనకొండ: రాష్ట్ర ప్రభుత్వం విమానాశ్రయాలపై దృష్టి సారించిన నేపథ్యంలో స్థానిక విమానాశ్రయాన్ని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా మంగళవారం పరిశీలించారు. జిల్లా కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారి దొనకొండకు విచ్చేస్తున్న కలెక్టర్‌కు ఆర్డీఓ జాన్ ఇర్విన్, తహసీల్దార్ సుజాత, ఎంపీడీఓ వసంతరావునాయక్ సాదర స్వాగతం పలికారు. ముందుగా రెండవ ప్రపంచ యుద్ధకాలంలో విమానాల ఆయిల్ ఫిల్లింగ్ నిమిత్తం నిర్మించిన విమానాశ్రయం భవనం నిర్మాణం యొక్క పటిష్టతను చూసి ఆనాటి ఇంజనీరింగ్ పనితనాన్ని మెచ్చుకున్నారు. విమానాశ్రయం ప్రస్తుతం ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధీనంలో ఉందని, సుమారు 135 ఎకరాల విస్తీర్ణం కలిగి ఉందని, అప్పటి రన్‌వే తదితర వివరాలను ఆర్డీఓ వివరించారు. ప్రస్తుత భూమి కాకుండా అదనంగా ఎంత భూమిని ప్రతిపాదించారు, అందులో ఏవైనా ఆక్రమణలు ఉన్నాయా అంటూ ఆమె తెలుసుకున్నారు. విమానాశ్రయానికి పూర్తి సమాచారంను మ్యాపులతో సహా క్లుప్తంగా నివేదికను అందించాలంటూ ఆదేశించారు. నియోజకవర్గ తెదేపా ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మీ, తహసీల్దార్ సుజాత, ఎంపీడీఓ వసంతరావునాయక్, డీటీ శ్రీనివాసరావు, విఆర్ఓ పిచ్చిరెడ్డి, ఏఎస్ఐ శ్రీనివాసరావు, సర్వేయర్ వెంకట్రావు తదితరులున్నారు.

ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాల్లో చేర్చడంపై మంత్రులు, ఎమ్మెల్యేల హర్షం

విశాలాంధ్ర - బల్లికురవ : కేంద్ర ప్రభుత్వం ఉమ్మడి ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాల జాబితాలో చేర్చడంపై జిల్లా మంత్రులు టీడీపీ ఎమ్మెల్యేలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయస్వామి, ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, కందుల నారాయణ రెడ్డి, బిఎన్ విజయ్ కుమార్, డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి, ముత్తుముల అశోక్ రెడ్డి, ఎంఎం కొండయ్య, ఇంటూరి నాగేశ్వరరావు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని కలిసి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాల జాబితాలో చేర్చిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రకాశం జిల్లా అభివృద్ధికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ నిధులతో జిల్లాను అన్ని విధాల అభివృద్ధి చేస్తామన్నారు.

సివిల్ సప్లైస్ గోడౌను తనిఖీ

విశాలాంధ్ర - రేపల్లె : పట్టణ పరిధిలోని 15వ వార్డులోని వేర్ హౌస్ గోడౌన్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి పలు నిర్దేశాలు చేశారు. రికార్డులను ,స్టాక్ ను వెరిఫికేషన్ చేసి సంబంధిత సిబ్బంది నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గోడౌన్‌లో ఉన్న స్టాకు రిజిస్టర్‌లో ఉన్న స్టాక్‌ను జేసీ పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. జెసి వెంట జిల్లా పౌరసరఫరాల అధికారి విలియమ్స్ రేపల్లె రెవిన్యూ డివిజనల్ అధికారి హేలా షారోన్, మండల తాసిల్దార్ రవీంద్రబాబు, సివిల్ సప్లై అధికారులు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు వరి విత్తనాలు పంపిణీ

విశాలాంధ్ర - నిజాంపట్నం : రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అని ఎంపీటీసీ సభ్యులు మేకా రాజేష్ ఖన్నా అన్నారు. మండలంలోని అడవులదీవి రైతు సేవా కేంద్రంలో మంగళవారం రైతులకు వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో సాగుకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న వరి విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం రైతులకు కల్పిస్తున్న రాయితీలు సద్వినియోగం చేసుకొని పంటలు బాగా పండించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ సయ్యద్ అలీ, టీడీపీ సీనియర్ నాయకులు యేమినేని నాగలక్ష్మి, కూచిపూడి మోహన్ రావు, మోర్ల రాంప్రసాద్, బడుగు వాసు, ఆలపాటి శ్రీను, మేకా కొండలరావు, టీడీపీ కార్యకర్తలు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలు జరిగితే ఉపేక్షించం: జేసీ

విశాలాంధ్ర - రేపల్లె : రేపల్లె రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో మంగళవారం బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు అక్రమ ఇసుక తవ్వకాలపై రేపల్లె డివిజన్ నందుగల సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా అందరికీ ఉచిత ఇసుక అందుబాటులో ఉంచేందుకు వీలుగా మరిన్ని ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్దేశానికి అనుకూలంగా ఉచిత ఇసుక ప్రజలకు ముఖ్యంగా భవన నిర్మాణ రంగ కార్మికులకు, యజమానులకు అందుబాటులో ఉండే విధంగా ఇప్పుడు ఉన్న ఇసుక స్టాక్ పాయింట్లకు అదనంగా ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు ఇందుకు సంబంధించి రెవెన్యూ, పోలీస్, మైనింగ్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. మైనింగ్ శాఖ అధికారులు ప్రజలకు ఉచిత ఇసుక ఎక్కడ అందుబాటులో ఉంటుందో పరిశీలించి అందుకు అనుగుణంగా జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేస్తారని దాని ప్రకారం దూర ప్రాంతాలకు వెళ్లకుండా దగ్గర్లోనే ఇసుక లభ్యం అయ్యేవిధంగా చర్యలు తీసుకుంటామని జేసీ తెలిపారు. ఈ సమావేశంలో బాపట్ల జిల్లా అదనపు ఎస్పీ విఠలేశ్వర్, రేపల్లె ఆర్డిఓ హేలా శరోన్, రేపల్లె పోలీస్ డిఎస్పి మురళీకృష్ణ, పట్టణ సీఐ నజీర్ బేగ్, రూరల్ సీఐ మల్లికార్జున, మండల తాసిల్దార్ రవీంద్రబాబు, జిల్లా మైనింగ్ శాఖ ఉన్నత అధికారులు, నదీ పరివాహక ప్రాంత పర్యవేక్షణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన ఉండాలి

విశాలాంధ్ర - చీరాల : నూతన చట్టాలపై యువతి యువకులు అవగాహన కలిగి ఉండాలని ప్రజల క్షేమం కోసమే ప్రభుత్వాలు చట్టాలు చేశారని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ ఎస్కే రెహానా అన్నారు. ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు చీరాల మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక చీరాల ఇంజనీరింగ్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెహానా మాట్లాడుతూ మోటారు సైకిళ్ల నడిపే విద్యార్థులంతా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, తద్వారా ప్రమాదాల నుండి రక్షణ పొందటమే కాకుండా, జరిమానాల బారిన పడకుండా దూరంగా ఉండొచ్చని అన్నారు. నూతన చట్టాల కనుగుణంగా హెల్మెట్ లేని వాహనదారులకు భారీగా జరిమానాలు విధిస్తారని, డ్రంక్ డ్రైవింగు, ట్రిపుల్ రైడింగ్, మైనర్ల రైడింగ్, రెక్లెస్ డ్రైవింగ్,బైక్ రేసింగ్,సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చెయ్యడం తదితర అంశాల గురించి అవగాహన కల్పించారు. నూతన చట్టాల ప్రకారం విధించబోయే జరిమానాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డి జగదీష్,చీరాల రెండవ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్ సత్యనారాయణ,చీరాల మోటారు వాహనాల ఇన్స్పెక్టర్,బి రామకృష్ణారెడ్డి, న్యాయవాద సంఘ అధ్యక్షులు జి రమేష్ బాబు,రోడ్ సేఫ్టీ కమిటీ సభ్యులు ఏ రాజా సాల్మన్,న్యాయవాది సిహెచ్ రామారావు,సోషల్ వర్కర్ పి ఎల్ వి యస్ డి మతీన్, ఈపురుపాలెం ఎస్సై ఎంవి శివ కుమార్,కళాశాల బోధన సిబ్బంది,విద్యార్థిని విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

డెల్టా తీరంలో ముమ్మరంగా వరి ఎద సాగు

రైతుల హర్షం

విశాలాంధ్ర - రేపల్లె : మండలంలో రైతులు వరి ఎద సాగుపై ఎంతో ఆసక్తిగా ఎద సాగుపై ఈ ఏడాది ముమ్మరంగా పొలాలలో వరి ఎద సాగు ప్రారంభించారు. మండలములోని వేజెళ్ల వారి లంక, మోర్ల వారి పాలెం, పేటేరు, ఉయ్యూరు వారిపాలెం, కారుమూరు, ఇసుకపల్లి, బేతపూడి, పెనుమూడి, తదితర గ్రామాలలో రైతులు పెద్ద ఎత్తున వారి సాగులో నిమగ్నమయ్యారు. ఇప్పటికే తమ పొలాలను మూడుసార్లు మెట్ట దుక్కి దున్ని ,ఆపై సదువుచేసి ఎకరాకు 20 కేజీల వడ్ల గింజలు చొప్పున ఎద సాగు చేస్తున్నారు. ఇటీవల సాగునీరు ప్రభుత్వం విడుదల చేసింది, దానికి తోడు వరుణుడు వరుణ దేవుడు కారునించటంతో ఆశించినంత వర్షాభావం డెల్టా తిరుమల సంభవిస్తుంది . ఈ ఖరీఫ్లో డెల్టా తీరంలో రైతులు ఎంతో ఆసక్తిగా ఎదపై మొక్కువుతో విస్తారంగా రైతులు వరి సాగు చేస్తున్నారు. ఎప్పటికప్పుడు అధికారుల సలహాలు తీసుకుని వరి పైరులో సస్యరక్షణ చర్యలు చేపడుతున్నట్లు రైతులు వెల్లడిస్తున్నారు ఎద సాగులో కలుపు మొక్కలను తొలగించే అధునాతన పద్ధతులను వ్యవసాయ శాస్త్రవేత్తల నుండి నుండి తెలుసుకొని వరి సాగు చేస్తున్నారు . డెల్టా తీరములో వారం రోజుల నుండి మోస్తారు వర్షాలు సంభవించటంతో రైతులు తమ హర్షాన్ని వ్యక్తం చేస్తున్నారు.

కౌలు హక్కు కార్డులపై అవగాహన

విశాలాంధ్ర-ముండ్లమూరు : కౌలు రైతుల కౌలు హక్కు పత్రాల కార్డులను పొందినప్పుడే ఎన్నో ప్రయోజనాలు చేకూరతాయని మండల వ్యవసాయ అధికారి మహమ్మద్ ఫరూక్ అన్నారు. మండలంలోని జమ్ములమడక గ్రామం లోని రైతు సేవా కేంద్రంలో ఆ గ్రామ సర్పంచి నలమోలు వెంకటేశ్వరరావు అధ్యక్షతన కౌలు రైతు గ్రామ సభ మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు కార్డులను పొందినప్పుడు పంటల బీమా, పంట నష్ట పరిహారం, బ్యాంకు రుణాలు అందుతాయి అన్నారు. కౌలు కార్డు పొందుటకు భూమి యజమాని నుండి ఆధార్ కార్డు, పాస్ ఫోటో, పాస్ పుస్తకం జిరాక్స్ కాఫీలతోపాటు, కౌలుకు తీసుకునేవారు ఆధార్ కార్డు, పాస్ ఫోటో, నకల కాపీలను వీఆర్వోకు అందజేయాలన్నారు. ఈ గ్రామ సభలో 12 మంది రైతులు కౌలు కార్డులకు దరఖాస్తు చేసుకున్నారు.

కనిగిరి విద్యుత్ షాక్ ఘటనపై మంత్రి తీవ్ర దిగ్భ్రాంతి

విశాలాంధ్ర - అద్దంకి : ప్రకాశం జిల్లా కనిగిరి మండలం పునుగోడులో విద్యుత్ షాక్‌తో ముగ్గురు యువకులు మృతి చెందడం పట్ల రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనలో యువకులు చనిపోవడం తనను కలిచివేసిందని పేర్కొన్నారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరపున నష్టపరిహారం చెల్లిస్తామని, అన్ని విధాలా అండగా ఉంటామని పేర్కొన్నారు.

సముద్ర తీరంలో జాగ్రత్తలు పాటించాలి

విశాలాంధ్ర - చీరాల రూరల్ : మండలంలోని వాడరేవు సముద్ర తీర ప్రాంతంలో స్నానాలు చేసి సేద తీరడానికి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. దీనితో ఎటువంటి దుర్ఘటనలు జరుగకుండా పోలీసు యంత్రాంగం జాగ్రత్త చర్యలు చేపట్టింది. పర్యాటకుల భద్రతకోసం 100 మీటర్లకు ఒక స్విమ్మర్ను అందుబాటులో ఉంచారు. నిర్దేశిత ప్రదేశాలలో మాత్రమే స్నానాలు చేయాలని కోరారు. సముద్రంలో పాతిన జండాల వరకే ప్రజలను స్నానాలకు అనుమతించారు. జండాలు దాటి వెళ్లకుండా నియంత్రించారు. ఈపురుపాలెం ఎస్సై ఎంవి శివకుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, మెరైన్ సిబ్బంది సముద్ర స్నానంపై పర్యాటకులతో మాట్లాడి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మద్యం సేవించి సముద్ర తీరంలో తిరిగితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు, మెరైన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలకు లిటిల్ ఏంజెల్స్ విద్యార్థుల ఎంపిక

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : జిల్లా స్థాయిలో నిర్వహించిన చదరంగం పోటీలకు లిటిల్ ఏంజెల్స్ విద్యార్థులు సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయినారని స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ అభినవ్ తెలిపారు. చెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నరేష్ మాట్లాడుతూ బాపట్ల టౌన్ విజయ లక్ష్మీపురం లోని లిటిల్ ఏంజెల్స్ ప్లే స్కూల్ లో ది. 22 వ తేదీన అండర్- 7, అండర్- 11 బాల బాలికలకు నిర్వహించిన చెస్ పోటీలలో లిటిల్ ఏంజెల్స్ స్కూల్ విద్యార్థులు బాలికల విభాగంలో చెరుకుపల్లి వేద శ్రీనిధి 6 వ తరగతి ప్రథమ స్థానం సాధించారని, షేక్ రిజ్వాన్ అహ్మద్ 5 వ తరగతి బాలుర విభాగం ద్వితీయ స్థానం సాధించారని అన్నారు. ఈ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు అండర్ 11 విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయిన సందర్భంగా లిటిల్ ఏంజెల్స్ స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులను అభినందించారు. ఈ నెల జూలై 27, 28 తేదీలలో భీమవరం లో నందు జరిగే రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు.